₹40

ఫిబ్రవరి – 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

Telugu Children's Monthly Magazine

సంపుటి : 33 • సంచిక : 5

FEBRUARY 2024



Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ. 330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ. 350 • తగ్గింపు ధర రూ. 300**



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక
BALA CHELIMI
Telugu Children's Monthly Magazine

సంపుటి: 33 Volume: 33 | సంచిక : 5 Issue : 5 | హైదరాబాద్ Hyderabad | ఫిబ్రవరి February | పేజీలు 52 Pages | రూ. ₹. 40

## లోపలి పేజీల్లో.......






స్వాగతం.. ................................ మణికొండ వేదకుమార్ (సంపాదకీయం) ... 5

**కథలు**

కొత్త జీవితం ................................ పి. వైష్ణవి ................................ 7

కనువిప్పు ................................ ఎన్. శిల్ప ................................ 8

గానుగెద్దు - గంగిరెద్దు ...................... దాసరి వెంకటరమణ .................. 9

మధుర ఫలం .......................... డా॥ అమరవాది నీరజ .................. 12

**సైన్స్**

కాగితంలో నీళ్లు మరిగించడం ............... సైన్స్ ................................ .... 14

**కథలు**

ఓ బ్రహ్మాదిత్యుడి విముక్తి ...................... డా॥ రోష్నీ ............................ 15

నింగి నేల మాదే ............................ పిషా నౌసీన్ ............................ 24

**చేతి వృత్తులు**

మట్టి పాత్రలు తయారీ ....................... జుగాష్ విలి ............................ 25

వృక్షో రక్షతి రక్షితః ........................ దారం గంగాధర్ ...................... 27
ప్రకృతి విద్య .............................. పి. భావన ............................ 30
బోర్లు ...................................... డా॥ వాసరవేణి పరశురాం .............. 32
అసలైన 'దైవ' కార్యం ...................... పుప్పాల కృష్ణమూర్తి .................. 35
ఉపకారం ................................ మా. శ్రీ. రాజు ........................ 37
చంద్రయాన్ ............................... డాక్టర్ ప్రభాకర్ జైనీ .................. 39
ఈ బాధ్యత మనందరిదీ! .................. కె.ఎ.ఎల్.సత్యవతి ...................... 43
రాగి తట్ట ................................ పి. నీలావతి .......................... 46
ఓ రాజ్యం కథ ............................ డా॥ సిరి ............................. 47


## పబ్లిషర్స్ నోట్

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడ ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'. రెండు సంవత్సరములు (2018 నుండి 2020 సం॥) చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం 'బాలచెలిమి' ముచ్చట్లు నిర్వహించింది. బాలసాహితీవేత్తలు, ఐ.టి. తదితర రంగాలకు చెందిన సాంకేతిక శాస్త్ర నిపుణులు, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలకు చెందిన నిష్ణాతులు అనేక మంది తమ తమ అనుభవాలను పంచుకున్నారు. పిల్లల బహుముఖ అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు బాల చెలిమి చక్కని ఉపకరణంగా ఉండాలనే ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం జనవరి నుండి బాల చెలిమిని మరింత ఆకర్షణీయ రంగులతో, విశేషాలతో మీ ముందుకు తెస్తున్నది. బాల బాలికలు, విద్యార్థినీ విద్యార్థుల, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు, బాలసాహితీ రచయితలు అందరూ 'బాలచెలిమి'ని ఆదరించి, తమ ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతున్నాం.




ముఖచిత్రం:
సయ్యద్ హస్మతుల్లా
బొమ్మలు :
కూరెళ్ల శ్రీనివాస్






**సంపాదకులు : వేదకుమార్ మణికొండ**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# స్వాగతం...

పిల్లలను జోకొడుతూ, వాళ్లని నిద్ర పుచ్చడానికి కథలు చెప్పే సాంప్రదాయం మనకు అనాదిగా ఉంది. అలాగాక వాళ్ల గుండె తలుపు తట్టి వాళ్లను మేల్కొలపడానికి కథలు చెప్పే కొత్త అవసరం కూడా నేడు మన ముందు ఉంది. పిల్లల మనస్సుల్లో నాటుకొనేలా వినోద విజ్ఞానాలను మేళవించి బాలసాహిత్యం కథలను తీసుకురావటానికి బాల చెలిమి సిద్ధమయ్యింది.

కథ అంటే పిల్లలు చెవి కోసుకొంటారు. కథల పట్ల పిల్లలకున్న ఈ ఆసక్తిని ఆసరాగా చేసుకొని ఎన్నో కథలు వచ్చాయి. వస్తూనే ఉన్నాయి. పిల్లలకు జానపద గాథలంటే చాలా ఇష్టం అనీ, అలాంటి కథలే వాళ్ల మనసులను దోచుకొంటాయనీ ఒక అభిప్రాయం మనలో వేళ్లూనుకొని ఉంది. నిజానికి ఊహాలోకాల్లోకి, స్వప్న జగత్తులోకి ఎగిరి పోవడానికి రంగురంగుల రెక్కలు ఇచ్చే కథల అవసరం ఎంతైనా ఉంది. అలాగే చెవి మెలేసి, జీవితం అంటే ఇదీ, ఇలా వుంటుంది అని కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్పే కథల అవసరం అంతకన్నా ఉంది. మారుతున్న విలువలు, వెల్లువలా ముంచెత్తుతున్న నూతన పరిణామాలు పిల్లల మనసుల్లో నాటుకోవాలంటే బాలసాహిత్యం ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందని మా విశ్వాసం.

ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు బాల చెలిమి చక్కని ఉపకరణంగా ఉండాలనే ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం జనవరి నుంచి బాల చెలిమిని మరింత ఆకర్షణీయమైన రంగులతో, ఎక్కువ పేజీలతో, విశేషాలతో మీ ముందుకు తెచ్చింది.

బాల బాలికలు, విద్యార్థినీ విద్యార్థుల, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు, బాలసాహిత్య రచయితలు అందరూ 'బాలచెలిమి'ని ఆదరించి, తమ ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతున్నాం.




వేదకుమార్.యం

– మణికొండ వేదకుమార్,

ఎడిటర్ బాలచెలిమి






బాలచెలిమి పిల్లల వికాస పత్రిక సంపాదకులకు శరణార్థులు. సరికొత్తగా వెలువడిన జనవరి సంచిక బాగుంది. పర్యావరణం, పిల్లల్లో మార్పులు తీసుకొచ్చే అనేక కథలుతో జనవరి సంచిక చాలా బాగుంది.

**-రావూరి ప్రసాద్,** హుజూర్ నగర్

⌘

బాల చెలిమి ఎడిటర్ గారికి నమస్తే. బాల చెలిమి మళ్ళీ రావడం చాలా సంతోషంగా ఉంది. 'గుల్లేరు బాలుడు' భీష్మసహాని గారి కథ, 'సూర్యుడూ బుజ్జి మొక్క' అనువంశీ కథ, బాలబోయిన రమాదేవి రాసిన 'రిసె దెబ్బ', శాంతి ప్రబోధ గారి 'భూమి డాక్టర్', ఎ. మౌనిక 'కష్టేఫలి', కొట్టాల అనూష 'దొరకని ఎలుక' ఇలా అన్ని శీర్షికలూ పిల్లల మానసిక, విజ్ఞానాభి వృద్ధికి తోడ్పడతాయి. పిల్లల చెలిమి బాల చెలిమికి మనసారా స్వాగతం...

**-పోతగాని అంజయ్య,** సిరిసిల్ల

బాల చెలిమి ఎడిటర్ అంకుల్ గుడ్ మార్నింగ్. బాల చెలిమి భలే ఉంది. అంకుల్ పద్యాలు, జానపద గేయాలు, సామెతలు, పాటలు, పొడుపు కథలు, సైన్స్, విజ్ఞానం వంటి మరొన్నో అంశాలు చెప్పగలరు. మాకు జోక్స్ చాలా కావాలి. కంప్యూటర్ గేమ్స్ మాకు చాలా వచ్చు. అవి రాసి పంపిస్తాం.

**చామర్తి హనీ, దత్తు,** హైదరాబాద్

బాలచెలిమి సంపాదకులు వేదకుమార్‌గారికి వందనాలు. పత్రిక చూస్తే చాలా సంతోషంగా ఉంది. పిల్లలు పాడుకోవడానికి మంచిపాటలు, సైన్సు, సామెతలు, పొడుపు కథలు, అనువాద కథలు, కార్టూన్ కథలతో బాల చెలిమి పిల్లలకు, పెద్దలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆశిస్తున్నాను. బాలచెలిమి తిరిగి పునఃముద్రణగా రావడం చాలా సంతోషం.

**బి. నిరంజనరావు,** మహబూబ్‌నగర్

చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750

*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**

Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010




# కొత్త జీవితం

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు రామాపురం. ఆ ఊరిలో శ్రీనివాస్, మంజుల అనే దంపతులు ఉన్నారు. వాళ్ళు చాలా పేదవాళ్ళు. వాళ్లు రోజంతా పని చేస్తే ఆ పూట గడుస్తుంది. వాళ్లకి ఒక కూతురు ఉంది. ఆమె పేరు శ్రావణి. వాళ్లు ఎంతో పేదవాళ్ళు. అయినా తమ కూతురిని చదివించాలని వాళ్ళ లాగా కాకూడదని చదివించారు. తమ కూతురు బాగా చదువుతుందని వారు అనుకుంటున్నారు. కానీ ఆమె చదవటం లేదు. దాంతో వాళ్ల స్కూల్

ఉపాధ్యాయులు మీ అమ్మాయి ఏమి చదవడం లేదని చెప్తారు. అప్పుడు ఆ తల్లిదండ్రులు చాలా బాధ పడతారు. లాభం లేదని భావించి శ్రావణిని హాస్టల్‌లో వేస్తారు. ఆమె హాస్టల్‌లో తమ తల్లిదండ్రుల మీద బెంగ పెట్టుకుని సరిగ్గా ఆహారం తినక అనారోగ్యానికి గురి అవుతుంది. దాంతో తన ప్రాణాల మీదికి తెచ్చుకుంటుంది. ఇది విని శ్రావణి తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. తమ కూతురి కోసం అప్పులు చేసి వైద్యం చేయిస్తారు. తల్లిదండ్రులు తనకోసం ఎంత కష్టపడుతున్నారో చూశాక తాను కూడా బాధ పడింది. శ్రావణి కోలుకున్న తర్వాత కష్టపడి చదవాలనుకుంది. ప్రతి రోజు బడికి పోవడంతో కొత్త జీవితం మొదలు పెట్టింది.

మళ్ళీ ఇంకోసారి నేను ఈ తప్పు చేయనని, వాళ్ళ తల్లిదండ్రులకు మాట ఇచ్చింది. అప్పుడు శ్రీనివాస్, మంజుల కూతురును చూసి చాలా సంతోషించారు. శ్రావణి ఉన్నతమైన చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించింది. అప్పుడు తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు చాలా బాగా చూసుకోసాగింది.

**నీతి:** తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్న విషయం గుర్తించి పిల్లలు ఉన్నతమైన చదువులు చదివి ఉద్యోగం సంపాదించి మంచి పేరు తీసుకు రావాలి. అప్పుడే కొంత ఋణం తీర్చుకున్న వారము అవుతాము.

– పి. వైష్ణవి, 9వ తరగతి
బాలికల ఉన్నత పాఠశాల, దుబ్బాక.

---

# కనువిప్పు

శ్రీరంగపురం అనే గ్రామంలో రాజు, రవి అన్నదమ్ములు ఉండేవారు. ఇద్దరు కలసి మెలిసి ఉండేవారు. తల్లిదండ్రులు బిడ్డలిద్దరికి పెళ్ళీడు రాగానే తల్లిదండ్రులు వాళ్ళకు పెళ్లిళ్లు చేశారు. పెద్ద కొడుకుకి రాజుకు ముగ్గురు కొడుకులు, చిన్న కొడుకు రవికి ఇద్దరు కొడుకులు జన్మించారు.

కొన్ని సంవత్సరాల తరువాత తల్లి రామవ్వ అనారోగ్యానికి గురయ్యింది. ఆస్తులపరంగా రాజు రవిలకు గొడవలు వచ్చాయి. రాజు, రవిల పిల్లలు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. ఒక రోజు వారిద్దరికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు జరిగాయి.

రాజు స్నేహితుడు గోపి కొడుకు రాజు, రవిల కొడుకులు ఒకే కళాశాలలో చదువుకుంటున్నారు. ఒకరోజు రాజు, రవిల ఇద్దరు కొడుకులకు ప్రమాదం జరుగగా ప్రమాదాన్ని చూసిన గోపి కొడుకు వాళ్ళ కొడుకుల ఇద్దరినీ ఆసుపత్రికి తీసుకవెళ్లి వైద్యం చేయించి రక్షించాడు.


గోపి ప్రమాదం జరిగిన విషయాన్ని స్నేహితుడు రాజుకు చెప్పాడు. రాజు, రవిలు ఆసుపత్రికి వెళ్లి వాళ్ళ కొడుకులను చూసి బాధపడ్డారు. ఏ సంబంధం లేని నా స్నేహితుని కొడుకు మన కొడుకులను రక్షించాడు. అదే రక్తసంబంధం ఉన్న మనమిద్దరం ఆస్తుల కోసం ఎందుకు విడిపోవాలని నిర్ణయానికి వచ్చి కలసిమెలసి ఉండాలి అనుకున్నారు.

వీరిద్దరు అన్నదమ్ములు కలసి ఉండడం చూసి వాళ్ళ అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఊరి ప్రజలు అన్నదమ్ముల అనుబంధం జూసి మెచ్చుకున్నారు.

**నీతి:** రక్త సంబంధీకులు గొడవలు పడి విడిపోతూ, కన్నవారిని బాధ పెట్టకూడదు.

– ఎన్. శిల్ప
10వ తరగతి, ఆంగ్ల మాధ్యమం
బాలికల ఉన్నత పాఠశాల,
దుబ్బాక.

కథ




# గానుగెద్దు - గంగిరెద్దు

*అదేపనిగా, పక్క చూపు లేకుండా తిరుగుతూ*
*గానుగ నాడిస్తుంది గానుగెద్దు!*
*తనకు చేతనైన కళాకౌశలంతో*
*ప్రజలకు వినోదం పంచి*
*తన యజమాని పొట్ట నింపుతుంది గంగిరెద్దు!*

పనీ, పాట లేక సోమరిగా, జులాయిగా తిరిగే పోకిరి వెధవను గానుగెద్దు - గంగిరెద్దులతో పోల్చడం ఎంతవరకు సమంజసం?

సుందరం అనేవాడు, రామాపురంలో ధనికుడైన చలపతి అనే ఒక వ్యాపారి కొడుకు. చిన్నప్పటి నుంచీ,

పట్నంలో తన మేనమామ దగ్గర ఉండి చదువుకున్నాడు. అయితే, తండ్రి బాగా గారాబం చెయ్యడం, అడిగినప్పుడల్లా డబ్బు పంపడం మూలాన, సుందరం చెడు స్నేహాలవైపు మొగ్గి, చివరకు ఎలాగో చదువు పూర్తి అయ్యిందనిపించి, రామాపురం తిరిగి వచ్చాడు.

సుందరానికి తాను పట్నంలో చదివి వచ్చానని, బాగా అహంకారం. ఆ అహంకారం అతడి ప్రతి మాటలోనూ కనిపించేది. సహజంగా వాగుడుకాయ అవడం వలన, వాదనలో తన తెలివితేటలు ప్రదర్శిస్తూ, ఎప్పుడూ తనదే పైమాట కావాలని తాపత్రయపడేవాడు.

ఒకరోజు స్నేహితులతో కలిసి, వీధి వెంట వెళుతున్న సుందరానికి వీరయ్య అనేవాడు చేతికి కట్టు కట్టుకుని ఎదురుపడ్డాడు.

"ఏం, వీరయ్యా! చేతికి ఏమిటా కట్టు?" అని అడిగాడు సుందరం.

"కిందపడ్డానండి", అన్నాడు వీరయ్య.

"అయ్యో, ఎలా పడ్డావు?"

"పరిగెత్తుతూంటే పడ్డానండి,"

"అలాగా! అసలు ఎందుకు అలా పరిగెత్తవలసి వచ్చింది?" అని ప్రశ్నించాడు సుందరం.

"వీధి కుక్కొకటి వెంటబడింది, చూడక దాని తోక తొక్కానండి," అన్నాడు వీరయ్య బాధగా.

"ఎందుకు చూడలేదు?" అన్నాడు సుందరం.

"ఏదో పరధ్యానంగా ఉండి," అంటూ వీరయ్య వెళ్ళబోయాడు.

"ఒక్క క్షణం ఆగు, వీరయ్యా! ఎందుకా పరధ్యానం?" అన్నాడు సుందరం.

"ఏం చెప్పమంటారయ్యా! ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాను, చూసుకోలేదు" అన్నాడు వీరయ్య.

"ఏం, ఆలోచిస్తున్నావు?" అని సుందరం రెట్టిస్తూ అడిగాడు.

వీరయ్య దిగులు ముఖం పెట్టి, "ఏవో మా ఇంటి గొడవలు, అంతే" అన్నాడు.

ఆ తర్వాత, సంభాషణ వేగం పుంజుకున్నది.

"సరే! పరిగెత్తుతూంటే కింద ఎందుకు పడ్డావు?" అన్నాడు సుందరం.

"కాలికి ఏదో అడ్డుపడింది!

"ఏం అడ్డుపడింది?"

"ఏమోనయ్యా, నేను చూడలేదు," అన్నాడు వీరయ్య.

"సరే! కిందపడితే, కుడిచేతికే ఎందుకు దెబ్బ తగిలింది? ఎడమచేతికి ఎందుకు తగల్లేదు?"

వీరయ్య, సుందరం వంక ఎగాదిగా చూసి, అక్కణ్నించి వెళ్లబోయాడు.

సుందరం, అతణ్ని పట్టుకుని ఆపి, "చూడు! మళ్లీ తప్పుచేస్తున్నావు. కుక్క తోక తొక్కడం తప్పు. అది వెంటబడితే పరిగెత్తడం తప్పు. ఇవిగాక, ఇంకా మరికొన్ని తప్పులు!" అన్నాడు.

"అయ్యా! ఈసారికి నన్నొదిలెయ్యండి. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చేయను," అంటూ వీరయ్య రెండు చేతులెత్తి దండం పెడుతూ తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

మరొకసారి, స్నేహితులతో కలిసి, వీధిలో వెళ్తున్న సుందరం దృష్టి, భైరవయ్య నూనె గానుగ మీద పడింది. ఎద్దు ఏ మాత్రం పక్కచూపు లేకుండా, అదే పనిగా తిరుగుతున్నది. భైరవయ్య గానుగకు కాస్త దూరంలో చెట్టు కింద, ఎద్దుకు దాణా కలిపిన కుడితిని తయారు చేస్తున్నాడు. సుందరం కాసేపు భైరవయ్యను

ఆటపట్టించాలనిపించి, స్నేహితులతో అటువైపు నడిచాడు.

భైరవయ్యకు, సుందరం గురించి పూర్తిగా తెలుసు. అయినా ఓపికగా అతడు అడిగిన ప్రతి ప్రశ్నకూ పొడిపొడిగా, సూటిగా తెలివిగా సమాధానాలు చెప్పుకుంటూ వచ్చాడు. భైరవయ్య జవాబులు చివరకు సుందరానికే విసుగనిపించసాగాయి.

భైరవయ్య ఎద్దును విప్పి కుడితి త్రాగిస్తుంటే, సుందరం కొద్దిసేపు మౌనంగా వూరుకుని, "అవును, భైరవయ్యా! గానుగెద్దుకెందుకు అంత విలువైన ఉలవలూ, తవుడూ పెట్టి కుడితి కలుపుతున్నావు? అదేమంత పనిచేస్తుందని?" అని అడిగాడు.

"ఎందుకు పనిచేయదు. ముప్పొద్దులా గానుగను ఆడిస్తూ తిరుగుతూంటుందిగా!" అన్నాడు భైరవయ్య.

"అదేమంత కష్టమని, గుంజ చుట్టూ తిరిగిన చోటే తిరుగుతుంది. అద్దైనా నీవు ఎదురుగా ఉంటేనే తిరుగుతుంది. నువ్వు లోపల ఏదో పనిలో ఉన్నావనుకో, అప్పుడు తిరుగుతుందని ఏం నమ్మకం? అట్టే నిలబడి పోవచ్చు గదా!" అన్నాడు సుందరం.

భైరవయ్య, సుందరం కేసి తిరిగి, "అందుకే ఎద్దు మెడలో ఒక గంట కట్టాను. నేను లోపల ఏ పని చేసుకుంటున్నా, ఆ గంట చప్పుడును బట్టి, ఎద్దు తిరుగుతున్నదీ లేనిదీ తెలిసిపోతుంది" అన్నాడు.

"అది తిరగకుండా, ఒక చోట నిలబడి ఊరికే తలవూపుతూండ వచ్చు కదా! అప్పుడు అది చేస్తున్న మోసం, నీకెలా తెలుస్తుంది?" అని అడిగాడు సుందరం.

"అలా జరుగదు" అన్నాడు భైరవయ్య.

"ఏం ఎందుకు జరుగదు?" రెట్టించి అడిగాడు సుందరం.

భైరవయ్యకు ఒళ్లు మండిపోయింది.

"ఎందుకంటావా! తిన్నది అరగాలని దానికి మాత్రం తెలియదా? తిండి పెట్టిన యజమానికి విశ్వాసంతో పనిచేయాలని దానికి మాత్రం ఉండదా? అయినా ఒకేచోట నిలబడి, తిరుగుతున్నట్లు నన్ను నమ్మించాలని ఉత్తినే తల ఊపడానికి దానికన్ని తెలివి తేటలెక్కడివిలే – అదేమన్నా పట్నంలో పెద్ద చదువులు చదివొచ్చిందా.. ఏమిటి!" అన్నాడు.

భైరవయ్య జవాబుకు సుందరం మిత్రులందరూ గొల్లున నవ్వారు. సుందరానికి తలకొట్టేసినట్లయింది. అతడి నోట మాట పెగలలేదు.

అప్పుడు భైరవయ్య, "చూడు సుందరం! ఇంత తిని, ఏ పనీ చేయకుండా వీధుల వెంట గాలికి తిరిగేవాణ్ణి, ఎందుకలా గానుగెద్దు లాగానో, గంగిరెద్దు లాగానో తిరుగుతావని కోప్పడతారు. కానీ అదెంత తప్పో తెలుసా? ఎందుకంటే గానుగెద్దు ముప్పొద్దులా తిరిగితేనే గానుగ పని నడుస్తుంది. అలాగే గంగిరెద్దు ఊరూరా తిరుగుతూ, తన ఆట చూపిస్తూ అందరినీ ఆనందపరిచి – తనను నమ్ముకున్న యజమానిని పోషిస్తుంది. అటువంటి ఎద్దులతో, గాలికి తిరిగే సోమరి వెధవను పోల్చడం ఎంతో అన్యాయం కదా!" అన్నాడు.

సుందరం మారు మాట్లాకుండా, తల వంచుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. ఆనాటి నుంచీ అతడు, తండ్రితో పాటు వ్యాపారం చూసుకుంటూ, కొద్ది కాలంలోనే తన తెలివితేటలతో వ్యాపారాన్ని అభివృద్ధి చేశాడు.

–దాసరి వెంకటరమణ

కథ

# మధుర ఫలం



సంజయ్, హారిక అన్నాచెల్లెళ్ళు. చదువులో, తెలివితేటలలో వారికి వారే సాటి. ఇంట్లో వారు ఆడింది ఆట, పాడింది పాట. బాగా చదవడంవల్ల బడిలో టీచర్లు కూడా వీరి అల్లరిని చూసీచూడనట్లుగా వదిలేసేవాళ్ళు. కానీ, వీళ్ళిద్దరూ స్నేహితుల దగ్గరకు ఆడుకోవడానికి వెళ్ళినా తమమాటే నెగ్గాలనే పంతంతో ఏదోరకంగా గొడవపడి కాసేపటికే మళ్ళీ ఇంటికి వచ్చేసేవాళ్లు.

వీళ్ళ సంగతి అమ్మానాన్నలకు తెలిసినా పిల్లలలకు ఏవిధంగా నచ్చజెప్పాలో వాళ్ళకు అర్థం కాలేదు. సంజయ్, హారికల అమ్మమ్మ, తాతయ్య వీళ్ళని చూడాలని ఊరినుండి వచ్చారు. ఒకరోజు హారిక ఆడుకోవడానికి స్నేహితుల దగ్గరికి వెళ్ళి, కొంతసేపు కాగానే ఏడుస్తూ ఇంటికొచ్చింది. కారణం ఏమిటని అడిగితే, తాను స్నేహితులతో క్యారంబోర్డు ఆడుకోవడానికి వెళ్ళానని, తాను ఎర్ర రంగు కాయిన్ కొడదామనుకుంటే వేరేవాళ్ళు ముందు కొట్టేస్తున్నారని, అందుకే ఏడుపు వచ్చి వచ్చేశానని చెప్పింది. ఆంతలో సంజయ్ కూడా కోపంగా ఇంటికి వచ్చి ఎవరితోనూ మాట్లాడకుండా ఒక మూల కూర్చున్నాడు. ఏమైందని అడిగితే..తను క్రికెట్ ఆడడానికి వెళ్ళానని, తనకు బ్యాటింగ్ అంటే ఇష్టమని, కానీ స్నేహితులు ఫీల్డింగ్ చేయమన్నారని, అది ఇష్టంలేక ఇంటికి వచ్చేశానని చెప్పాడు.

పిల్లల బడిలో పాఠాలు కంఠతాపట్టి తరగతిలో ఫస్టు వస్తున్నారు కానీ, సాటివారితో కలసిమెలసి కాసేపు కూడా ఉండలేరని, జీవిత పాఠాలు చదువుకోలేదని అమ్మమ్మ, తాతయ్య అర్థం చేసుకున్నారు. వాళ్ళు చేస్తున్న తప్పును వాళ్ళకు తెలిసేట్టు చేయాలనుకున్నారు.

మర్నాడు శివరాత్రి కావడంవల్ల బడికి సెలవు ఇచ్చారు. అమ్మమ్మ, తాతయ్య గుడికి వెళ్తూ పిల్లల్ని కూడా తమతో తీసుకెళ్ళారు. గుడి నుండి వచ్చేటప్పుడు వీధినిండా రకరకాల పళ్ళు అమ్ముతుంటే చూసి, ఫ్రూట్‌సలాడ్ చేసుకుందాం పళ్ళు కొనమంటూ హారిక తాతయ్యను అడిగింది. సంజయ్ తనకూ ఇష్టమే అన్నాడు. అమ్మమ్మ కూడా – 'శివరాత్రి కదా! ఈరోజు నాకూ అ పళ్ళే ఆహారం' అంది. వారి ఇష్టప్రకారం తాతయ్య 'ద్రాక్ష, అరటి, ఆపిల్, దానిమ్మ, సపోటా, పుచ్చకాయ, బత్తాయి' పళ్ళు కొన్నారు.

సాయంత్రం పూజ అయిన తర్వాత పళ్ళు కోయడానికి సంజయ్, హారికలను వాళ్ళ అమ్మమ్మ పిలిచింది. ఇద్దరూ ఉత్సాహంగా వాటిని తరగడానికి పీటలు, చాకులు తీసుకొచ్చారు. మొదట ద్రాక్ష పళ్ళని తీసుకున్నారు. తరువాత కొంచెం కష్టపడి ఆపిల్ పళ్ళని చిన్నచిన్న ముక్కలుగా తరిగారు. దానిమ్మ పైన తొక్క తీయటం రాక అమ్మమ్మని తీయమన్నారు. పుచ్చకాయను తాతయ్య సాయంతో తరిగారు. సపోటా పైన తొక్క ఉన్నా హారిక తేలికగా తీయగలిగింది. సంజయ్ అరటి పళ్ళని చిన్న ముక్కలుగా చేసి, బత్తాయిలని తేలికగా తొక్క తీసి తొనలు ఒలిచాడు.

మొత్తానికి అమ్మమ్మ, తాతయ్యలతో కలిసి సంజయ్, హారిక పళ్ళన్నిటినీ ముక్కలుగా తరిగారు. సంజయ్ వాళ్ళ అమ్మ పళ్ళ ముక్కలకి పాలు, పంచదార, ఇంకా కావలసిన వన్నీ కలిపి ఫ్రూట్ సలాడ్ తయారు చేసింది. పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఫ్రూట్ సలాడ్ తింటున్నారు. అప్పుడు హారిక 'పళ్ళ తొక్కలు కొన్ని తేలికగా వచ్చాయి. కొన్నింటిని కష్టపడి తీశాం. కొన్నిటికి తొక్కలే లేవు. కాని, అన్ని పళ్ళని కలిపి తింటుంటే ఎంతో రుచిగా ఉన్నాయి." అంది.

సంజయ్ కూడా "విడివిడిగా ఒక్కొక్క పండు తిన్నప్పటికంటే ఇలా కలిపి తింటే చాలా బాగుంది" అన్నాడు. పక్కనే ఉన్న అమ్మమ్మ – "పిల్లలైనా, పళ్ళయినా కలిసి ఉంటే చూడటానికి బాగుంటుంది." అంది. అక్కడే ఉన్న తాతయ్య– "పిల్లలూ! మీరు మీ స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్ళి, ఏదో ఒక కారణంతో తగవు పడుతున్నారు. మీరు తొక్కతీసిన పళ్ళని చూడండి... పుచ్చకాయ తొక్కని మీరు తీయలేకపోయారు. కానీ, తొక్క తీస్తే లోపల ఎంత బాగుందో తిన్న తర్వాత మీకు తెలిసింది కదా! అలాగే దానిమ్మ, అరటి తొక్కలని తీసి తయారు చేసిన ఫ్రూట్‌సలాడ్ రుచి మాటల్లో చెప్పలేము కాదా! అలాగే మీరిద్దరూ మీలోని తప్పులు తెలుసుకొని,మీ స్నేహితులలోని చిన్నచిన్న లోపాలను మరచి కలిసిమెలిసి ఉంటే జీవితం కూడా ఫ్రూట్‌సలాడ్ లాగా మధురంగా ఉంటుంది మరి!" అని చెప్పారు.

సంజయ్, హారిక తాము స్నేహితులతో అనవసరమైన కారణాలతో గొడవపడుతున్నామని అర్థం చేసుకున్నారు. అమ్మమ్మ, తాతయ్యలతో– "మేమిప్పుడు తొక్కతీసిన పళ్ళలాంటివాళ్ళం. మా స్నేహితులతో ఫ్రూట్‌సలాడ్‌లో పళ్ళలాగా కలిసిపోతాం. ఇకమీదట తొక్కలాంటి గొడవలు పడం" అని చెప్పారు.

**–డా॥ అమరవాది నీరజ**

(చిరుకానుక పిల్లల కథలు)



# కాగితంలో నీళ్లు మరిగించడం

నీళ్లు కాచుకోవడానికి గిన్నెగానీ, కుండగానీ ఉపయోగించడం విన్నాం గానీ, కాగితాన్ని ఉపయోగించడం ఎక్కడా ఎరగం. కాగితాన్ని నిప్పుల మీద పెట్టీ పెట్టగానే మసి అయిపోదూ? చూద్దాం. ఈ గారడీ చెయ్యడానికి పాత పోస్ట్‌కార్డు, నాలుగు గుండు సూదులు, లేదా పేపరు క్లిప్పులు, కొవ్వొత్తి కావాలి. పోస్టుకార్డుకి చుట్టూ ఒక అర అంగుళం వెడల్పున మార్జిను గీసి, ఆ గీతల వెంబడి మడతలు పెట్టి, దొన్నెలాగ చెయ్యాలి. అవసరం అయితే నాలుగు మూలలా గుండు సూదుల్ని పేపరు క్లిప్పుల్లో గుచ్చి, దొన్నె విడి పోకుండా గట్టిగా ఉండేటట్లు చెయ్యాలి.

కొవ్వొత్తి వెలిగించి, నేలమీద నిలబెట్టు. తయారుచేసిన కాగితపు దొన్నెలో సగంపైగా నీళ్ళుపోసి, దానిని కొవ్వొత్తి మంటమీద పెట్టి, పట్టుకో.

కాగితం కాలి, చిల్లుపడి నీళ్ళు బయటికి కారిపోతాయనే భయం అ క్కరలేదు. కాగితం కాలదు. మసి అంటుకుంటుంది అంతే. త్వరలోనే దొన్నె లోని నీళ్ళు మరగడం మొదలు పెడతాయి.

ఇది ఎలా సాధ్యమైందీ? కాగితం ఎందుకు కాలిపోలేదూ? దొన్నెలో ఉన్న నీళ్ళే ఇందుకు కారణం. నీళ్లు మంట వేడిని పీల్చుకుని, కాగితాన్ని చల్లబరుస్తూ ఉంటాయి.

వంద డిగ్రీలు సెంటీగ్రేడు ఉష్ణోగ్రత వద్ద నీళ్ళు మరుగుతాయని మనకు తెలుసు. ఇంకా మంట పెడితే నీళ్ళు ఆవిరి అయిపోతూ ఉంటాయే కాని, వాటి ఉష్ణోగ్రత మాత్రం పెరగదు. ఈ కారణం వల్ల నీళ్ళు ఉన్న కాగితపు ఉష్ణోగ్రత $100^0$ సెంటీగ్రేడు దాటి పెరగదు. కాగితం మండడానికి ఈ ఉష్ణోగ్రత చాలదు. కాబట్టి దొన్నెలో నీళ్ళు ఉన్నంతసేపూ కాగితం కాలదు; చిల్లు పడదు.

–డా॥ మహీధర నళినీమోహన్ 



# ఓ బ్రహ్మాదిత్యుడి విముక్తి

*(బ్రహ్మచారులుగా మరణించిన బ్రాహ్మణ దెయ్యాలను బెంగాలీ భాషలో బ్రహ్మాదిత్యులంటారు. దెయ్యాలుగా కూడ అవి కులాధిక్యత కలిగి ఉంటాయి. ఇతర కులాలకు చెందిన దెయ్యాలు ఆక్రమించని చెట్టేదైనా ఉంటే దాని మీద బ్రహ్మాదిత్య దెయ్యాలు ఒంటరిగా నివసిస్తాయి. బ్రాహ్మణేతర దెయ్యాలు గుంపులుగా ఒకే చెట్టు మీద నివాసం ఏర్పరచు కుంటాయి. వాటికి బ్రహ్మాదిత్యులు పురోహితులుగా వ్యవహరిస్తారు – రచయిత)*

ఒకానొకప్పుడు ఒక గ్రామం బయట పాడుబడిన ప్రదేశంలో వకుళ వృక్షంపై ఓ బ్రహ్మాదిత్యుడు ఉంటూ ఉండేవాడు. ఆ వకుళ వృక్షం బాగ ఎత్తుగా, గుబురుగా ఉండి కొంచెం నేరేడు చెట్టులా ఉండేది. ఆ చెట్టుని చూడబోతే గొప్ప విశేషం ఏమీ కాదు. కాని దాని పువ్వులు చిన్నగా చుక్కల్లా ఉండి, సువాసనతో ఘుమఘుమలాడేవి. సంవత్సరమంతా నేల పైనున్న గడ్డిపై ఆ పూలు రాలుతూ ఉండేవి. ఇలా వకుళ పుష్పాలతో నిండిన బాటలమీద ప్రేమికులు

విహరిస్తున్నట్లుగా బెంగాలీ జానపద కవులు తమ పాటల్లో వర్ణిస్తూ ఉంటారు. గ్రామాల్లో చాలా మంది తమ ఆడపిల్లలకు ప్రేమతో 'వకుళ' అనే పేరు పెట్టుకుంటారు.

మన కథలోని బ్రహ్మాదిత్యుడు బ్రతికుండగా (చిన్న కుర్రాడిగా ఉన్నప్పుడు) ఇతర పిల్లలతో కలిసి ఆ వకుళ వృక్షం వద్దకు వస్తూ ఉండేవాడు. ఆ బాలుడు అక్కడుండే పూలకోసం కాకుండా, దాని కుండే బాగ మగ్గిన తియ్యటి వకుళ ఫలాల కోసం వచ్చేవాడు. వయసులో తన కంటే చిన్నవాళ్లయిన ఆడపిల్లలు బొమ్మల పెళ్లిళ్ల కోసం పూలమాలలు అల్లడానికై పూలు ఏరుకోడానికి ఆ చెట్టు దగ్గరికి వచ్చేవారు. ఒక్కోసారి ఆ ఆడపిల్లలు కొన్ని పళ్లిమ్మని అబ్బాయిల్ని అడిగేవారు.

ఆ అమ్మాయిల్లో మన కథానాయకుడికి ఇష్టమైన ఓ అమ్మాయి ఉండేది. ఆమె పేరు వకుళ. మన కథానాయకుడు ఆమెకెప్పుడూ వకుళ ఫలాలు ఇస్తూ ఉండేవాడు. యుక్తవయసు వచ్చేసరికి వాళ్ళిద్దరికి మధ్య విపరీతమైన ఇష్టం ఏర్పడింది. కాని వాళ్ల కులాలు వేరని వారికి తెలిసింది.

త్వరలోనే ఆ అమ్మాయికి వివాహమై దూరంగా ఉన్న మరో గ్రామానికి వెళ్లిపోయింది. మరెవ్వరిని వివాహమాడకూడదని నిర్ణయించుకొని మన బ్రాహ్మణ బాలుడు మరణించేవరకూ బ్రహ్మచారిగా ఉండిపోయాడు. ఆశ్చర్యం ఏమిటంటే, చిరకాలంగా ఉన్న అతని విచార రహస్యాన్ని ఎవరూ ఊహించలేదు. అతను చిన్నతనం నుంచి సాధు స్వభావం కలవాడని అనుకునేవారు.

బ్రహ్మాదిత్యుడు ఏ కారణం చేత ఆ వకుళ వృక్షాన్ని తన నివాసంగా ఎన్నుకున్నాడో ఆ పక్కనే ఉన్న పెద్ద మఱ్ఱి చెట్టు మీద నివసిస్తున్న దెయ్యాలకు అసలు తెలియనే తెలియదు. పైగా ఆ వకుళ వృక్షం క్రింద పగలు పిల్లలు అల్లరిచేస్తూ ఉంటారు. రాత్రులందు ముసలి దెయ్యాలు దాడిచేస్తూ ఉంటాయి.

కుర్రవాళ్లు పళ్లకోసం వకుళవృక్షాన్ని ఎక్కినప్పుడు మొదట్లో బ్రహ్మాదిత్యుడికి చాల విసుగ్గా ఉండేది. కాని కొద్ది రోజుల్లోనే అతను వారి అల్లరికి అలవాటు పడిపోవడమే కాకుండా వాళ్లంటే ఒక విధమైన మమకారం కలిగింది. ఆ పిల్లలు మొత్తం పదకొండుమంది. వాళ్లంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేవాళ్లు. ఒక రోజు హాస్యానికి ఆ పిల్లలంతా నా కొడుకులని బ్రహ్మాదిత్యుడు తనలో అనుకున్నాడు. కాని ఇలా హాస్యానికి అనుకున్నా కొద్ది కాలంలోనే అతనికి తెలియకుండానే అతనిలో పితృవాత్సల్యం పెల్లుబికింది. ఏమైనా సరే ఆ పిల్లల ప్రేమని చూరగొనాలని అతను కలలు కనసాగాడు.

ఒకరోజు ఇక తట్టుకోలేక ఎవరికీ కనబడకుండా రహస్యంగా గ్రామంలోకెళ్లి ఒక వడ్రంగి దుకాణం నుంచి అతను పన్నెండు చెక్క బొంగరాల్ని ఎత్తుకొచ్చాడు. వాటిని పిల్లలు వచ్చే లోపునే వకుళ వృక్షం క్రింద ఉంచాడు. కాని తర్వాత జరిగిన గొడవంతా అతన్ని చాల నిరుత్సాహపరిచింది. మొదట ఆ పదకొండు మంది కుర్రాళ్లు మిగిలిపోయిన పన్నెండో బొంగరం కోసం దెబ్బలాడుకున్నారు. తర్వాత వడ్రంగి ఫిర్యాదు చేయుగా ఆ పిల్లల తల్లిదండ్రులు కుర్రాళ్లను చావబాదారు. ఎందుకంటే ఆ బొంగరాన్ని పిల్లలే దొంగిలించి తెచ్చారని తల్లిదండ్రుల నమ్మకం. అందువల్ల పిల్లలకోసం జిలేబీలు తెచ్చి వకుళ వృక్షం కొమ్మల మీద పెడదాం అనే ఉద్దేశాన్నించి

విరమించుకున్నాడు మన దయానిధి బ్రహ్మాదిత్యుడు.

ఉదయాన్నే చిన్న వయసులో ఉన్న ఆడపిల్లలు బృందాలుగా వకుళ వృక్షం దగ్గరకు వచ్చేవాళ్లు. పూర్వం వాళ్ల అమ్మలు, అమ్మమ్మలు మాదిరి వాళ్లు కూడ వకుళ పుష్పాలు ఏరి మాలలు కట్టేవారు. బ్రతికుండగా ఆడవాళ్లంటే ఆసక్తి లేని మన బ్రహ్మాదిత్యుడు అలవాటు ప్రకారం ఈ ఆడపిల్లలను కూడ ఖాతరు చేయలేదు. కాని ఒక రోజు పిల్లలంతా ఒక అమ్మాయిని 'వకుళ' అని పిలవడం విన్నాడు. దాంతో అతను కరిగి పోయాడు.

ఆ చెట్టు మీదికొచ్చిన కొత్తలో మన దెయ్యం తన బాల్యం గురించి, తన ప్రేయసి గురించి గంటల తరబడి ఆలోచిస్తూ ఉండేవాడు. కాని కొద్దిరోజుల్లోనే ఆమె రూపం మస్తిష్కం నుంచి మాయమవసాగింది. ఆ చెట్టు క్రింద ఆడుకోడానికొచ్చిన పిల్లలు ఆ చెట్టుని 'వకుళవృక్షం' అనే పేరుతో ప్రస్తావించేవారు కాదు. దాన్ని 'ఈ చెట్టు' లేక 'ఈ పూలు' అని మాత్రమే ప్రస్తావించేవారు. ఇప్పుడయితే ఎందుకు ఆ చెట్టుని తన నివాసంగా చేసుకున్నాడో మన దెయ్యానికి గుర్తులేదు. కాని ఈ రోజు ఎవరో పిల్ల నోటి నుండి 'వకుళ' అనే పేరు వినేసరికి వెయ్యివీణలు ఒక్కసారిగా మ్రోగినట్లయింది. వకుళ అనే పాపవంక అతను ఆతృతగా చూసాడు. అయితే అతని ప్రేయసి వకుళకి, ఈ అమ్మాయికి చాల తేడా ఉంది. అతని ప్రేయసి వకుళ పిచ్చుకలా వాగుడుకాయ. ఎప్పుడూ ఉరుకులు పరుగులు పెడుతూ ఉండేది. కాని ఆమె కళ్లెప్పుడు మెరుస్తూ ఉండేవి. ఆమె ముఖం, ఈ కొత్త వకుళ ముఖం మధ్య చాల తేడా వుంది.

వకుళ అనే ఈ చిన్న పాప చాల నెమ్మదయింది. పెదవి విప్పదు. ఎప్పుడూ విచారంగా ఉంటుంది. ఆమె కళ్లెప్పుడూ దుఃఖంతో నిండి ఏదో మబ్బుకమ్మి నట్లుంటాయి. ఈ పాప ఎప్పుడూ ఇతర పిల్లలకంటే వెనుకబడి ఉండేది. ఒక్కోసారి మిగతా పిల్లలు ఈ పాప అక్కడుందనే విషయాన్నే మరిచి పోయేవారు.

ఈ అమ్మాయి ఇల్లు, తల్లిదండ్రులు మన బ్రహ్మాదిత్యుడికి తెలుసు. తన అదృశ్యరూపంలో మన దెయ్యం వాళ్ల ఇంటికి వెళ్లాడు. ఆ పిల్ల తల్లి కొన్ని సంవత్సరాల క్రితమే మరణించిందని అతనికి తెలిసింది. ప్రస్తుతం ఆమె పిన్ని (సవతి తల్లి) ఆ అమ్మాయి విషయంలో అన్ని విధాలా సవతి తల్లి అనిపించుకుంటోంది. మరో విషయం మన దెయ్యానికి తెలిసింది. అదేమిటంటే ఆ అమ్మాయి తండ్రి ఆ పిన్ని మోహంలో పడి కొట్టుకుంటున్నాడని, ఆ అమ్మాయి వారికి బండచాకిరి చేయకపోతే కఠినంగా శిక్షిస్తారని తెలిసింది. ఆ పిల్లకు ఎలా సాయం చెయ్యాలో మన దెయ్యానికి తెలీదు. పైగా అతను ఏ మాత్రం ఈ విషయంలో జోక్యం చేసుకున్నా ఆ అమ్మాయి ప్రమాదంలో చిక్కుకునే పరిస్థితి ఉంది. ఈ సమస్య గురించిన అంతులేని ఆలోచనలతో అతను సతమతమయ్యేవాడు.

చివరకు ఒకరోజు ఆ కఠినాత్మురాలయిన పిన్ని మీద ఎప్పట్నుంచో ఉన్న కోపం తీర్చుకునే అవకాశం అతనికి లభించింది. చాలాకాలం తర్వాత ఆ రోజు ఉదయాన్నే వకుళ చెట్టుదగ్గర కొచ్చింది. నిశ్శబ్దంగా పువ్వులు ఏరుకుంటోంది. అంతలో చేత్తో బెత్తం వూపుకుంటూ ఆమె పిన్ని అక్కడికొచ్చింది. నానా తిట్లు తిట్టి ఆ అమ్మాయిని కొట్టడం మొదలెట్టింది.

మన దెయ్యం ఇక చూస్తూ ఊరుకోలేక పోయాడు. చెట్టుదిగి క్రిందకు వచ్చాడు. దార్లో వున్న పేడ తీసి పిన్ని ముఖమంతా పూసాడు. దాంతో ఏదో దెయ్యం తనిని సతాయిస్తోందని అనుకుంటూ పిన్ని అక్కడ్నుంచి పరుగెత్తి పారిపోయింది. ఈ జరిగిన దానికి మిగతా పిల్లలందరూ సాక్షులుగా మిగిలారు. అందువలన గ్రామంలోని జనమందరికి ఈ వార్త తెలిసిపోయింది. దాంతో పిన్నిగార్ని అందరూ హేళన చేయసాగారు.

ఏదో దయగల మంచి దెయ్యం అంటే వాళ్ళమ్మ ఆత్మే చిన్నారి వకుళని రక్షిస్తోందని అంతా అనుకున్నారు. అప్పట్నుంచీ వకుళను ఏడిపించే ధైర్యం ఎవరికీ లేకపోయింది. అయితే వకుళ వృక్షం వద్దకు అసలు పిల్లలు రావడం మానేసారు. దీనివల్ల బ్రహ్మాదిత్యుడికి చాల దుఃఖం కలిగింది.

చిన్న పిల్లలకి అంతగా అలవాటు పడిపోయిన మన ఒంటరి బ్రహ్మాదిత్యుడిని ఒక విధమైన విచారం పట్టుకుంది. మరి రోడ్ల మీద జనంతో నిండిన బండ్ల వెనక చాల దూరం నడిచిపోయేవాడు. కాని చిన్నారి వకుళ అక్కడకు వచ్చేది కాదు. పోనీ ఆ అమ్మాయి ఇంటికి తరచూ పోడానికి కూడ భయమే. ఎందుకంటే అతను ఉండబట్టలేక ఆ అమ్మాయి పిన్నిని ఇబ్బంది పెట్టే పనేదైనా చేస్తే, పాపం ఆ చిన్నారి కష్టాల పాలవుతుందని అతని భయం. ఏమయినా అతనేమో దెయ్యం. ఆ అమ్మాయేమో మనిషిగా బ్రతకాలి కదా. అందువల్ల ఆ అమ్మాయికి అన్ని విధాలా సాయం చేసే పరిస్థితి మన బ్రహ్మాదిత్యుడికి లేదు. అప్పుడప్పుడు మౌనంగా ఆమెని ఒక్క క్షణం చూసి, ఆ పైన ఆమెని ఒంటరిగా వదిలేసేవాడు.

వకుళ వృక్షానికి దగ్గర్లోనే ఒక పెద్ద మర్రిచెట్టు ఉండేది. దానిమీద చాల రకాల దెయ్యాలు నివసిస్తూ ఉండేవి. జనాల్ని నిర్దాక్షిణ్యంగా చంపడంలో వాటికి మహదానందం కలిగేది. అలా చనిపోయిన వారి ఆత్మలను అవి భీకర నృత్యాలతోను, కేకలతోను అర్ధరాత్రి వేళ తమ సంఘంలోకి ఆహ్వానిస్తూ వెర్రిగా ఆనందించేవి. ఇలా ఈ మర్రి చెట్టు మీది దెయ్యాలకు బలయ్యేవారంతా దూరపు గ్రామాల నుంచి వచ్చిన బాటసారులు మరి. ఈ చెట్టు గురించి వారికి తెలియనందువలన రాత్రి ప్రయాణంలో దాని క్రింది నుంచి పోతూ ఉండే వారు. ఆ విధంగా మర్రిచెట్టు మీది దెయ్యాల సంఘంలో కొత్తవారు వచ్చి చేరుతూ ఉండేవారు.

కొత్త దెయ్యాల్ని ఆశీర్వదించి దెయ్యాల సంఘంలోకి చేర్చుకోడం మన బ్రహ్మాదిత్యుడి బాధ్యతల్లో ఒకటి. ఎప్పుడూ ఎవ్వర్నీ చంపొద్దని అతను బోధిస్తూ ఉండేవాడు. మిగతా దెయ్యాలకు అతనంటే చాల గౌరవం ఉన్నప్పటికీ అతని బోధనలను మాత్రం అవి లెక్కచేసేవి కాదు. వారి వ్యవహారాల్లో బ్రహ్మాదిత్యుడు ఎంత తక్కువ జోక్యం చేసుకుంటే అంత ఎక్కువ అవి అతన్ని గౌరవించేవి. భయభక్తులతో వ్యవహరించేవి. బ్రహ్మాదిత్యుడు ఎవర్నీ చంపడని, అందువల్ల అతని శాపం ఋషుల శాపం వలె ప్రమాదకరమయినదని మిగతా దెయ్యాలు భావించేవి. మిగతా దెయ్యాల చేతిలో చావునుంచి ఏ జీవినైనా రక్షించడానికి బ్రహ్మాదిత్యుడు వెనుకాడడని వాటికి తెలుసు. అలా రక్షించడం వల్ల బ్రహ్మాదిత్యుడు ఈ లోకం నుంచి విముక్తి పొంది, స్వర్గానికి పోయే అవకాశం ఉంటుందని కూడ ఆ దెయ్యాలకు తెలుసు.

అందువల్లనే బ్రహ్మాదిత్యుడు మర్రిచెట్టుకి దూరంగా ఉన్నప్పుడే తమ దుష్టకార్యాలను సాగించేవి. అతను దగ్గర్లో ఎక్కడయినా ఉంటే అలాంటి పనులు చేయడానికి భయపడేవి. కాబట్టి వకుళ వృక్షం వద్ద జనం క్షేమంగా ఉండడానికి కారణమేమిటో అర్థమవుతుంది. బ్రహ్మాదిత్యుడు కనుక దగ్గర్లో లేకుంటే పెద్దలయినా, పిల్లలయినా సరే మధ్యాహ్నం సమయంలో కూడ ఆ మర్రి చెట్టు ప్రాంతానికి రావడం ప్రమాదకరంగా ఉండేది. తమ నిస్సారమై, నిరాసక్తమైన జీవితాల కారణంగానే ఆ దెయ్యాలు ఆ విధంగా నిష్కారణంగా జీవుల్ని చంపేవి.

ఒక చీకటి రాత్రి వకుళ వృక్షం క్రింద మనం ఊహించలేని సంఘటన ఒకటి జరిగింది. మన బ్రహ్మాదిత్యుడు ఒక ఎత్తైన కొమ్మ మీద పడుకొని ఆకాశంలో మిణుకు మిణుకుమంటున్న చుక్కలవైపు చూస్తూ, పిట్టలూ, పురుగులు చేసే శబ్దాన్ని వింటున్నాడు.

మర్రిచెట్టుమీద అంతా నిశ్శబ్దంగా ఉంది. గ్రామానికి మరో చివర 'కాళి' పూజ జరుగుతోంది. అక్కడ వాయిస్తున్న డప్పు బాజాలు దూరంగా మేఘాలు ఉరుముతున్నట్లు వినిపిస్తున్నాయి. అర్థరాత్రి గడిచాక నేరుగా వకుళ వృక్షం కింద నుంచి ఎవరిదో గొంతు నెమ్మదిగా మన బ్రహ్మాదిత్యుడికి వినిపించింది. ఆ చీకటిలో ఎవరో మనిషి నిలబడి ఉన్నట్లు చూసి, బ్రహ్మాదిత్యుడు తన అదృశ్యరూపంలో చెట్టు కిందికి దిగాడు.

అక్కడ నిలబడి ఉన్నది తన స్నేహితుడైన ఒక బ్రాహ్మణుడి కొడుకు. అతని పేరు ప్రహ్లాదుడు. అతని తండ్రి ఈ మధ్యనే మరణించడం, నేరుగా స్వర్గానికి పోవడం జరిగింది. మన బ్రహ్మాదిత్యుడికి ప్రహ్లాదుడు తెలుసు. కాని అతను దెయ్యంగా మారిన తర్వాత అతన్ని చూడలేదు. ఆ యువకుడు ఎత్తుగా, అందంగా ఉన్నాడు. కాని అతని ముఖం చాల కాలంగా తిండి లేనట్టు దీనంగా ఉంది. అతని బట్టలు చాల చోట్ల చిరిగినందువల్ల కుట్లు వేయబడి, మురికిగా ఉన్నాయి.

ఆ యువకుడు భయంతో ఆయాసపడుతూ, వణుకుతూ "రామ, రామ, కాళి, కాళి" అని గొణుగుతున్నాడు. ఆపై గట్టిగా, "ఓ రామా, ఓ కాళీ! నాకు కొంచెం ధైర్యం కలిగించండి. ఓ తల్లీ! కొంచెం ధైర్యం యివ్వు అని ప్రార్థించడం మొదలు పెట్టాడు .

తన అసలు స్వరూపంలో, తెల్లని బట్టల్లో మన దెయ్యం ఆ యువకుడి ముందు ప్రత్యక్షమయ్యాడు. కాని ఆ యువకుడు ఎవ్వరినీ గుర్తించే స్థితిలో లేడు. "ఓ యువకుడా! నేను దెయ్యాన్నే. కాని నేనంటే భయపడొద్దు. నన్ను ముట్టుకోవద్దు. కాని ఈ రాత్రి సమయంలో ఇక్కడికి ఎందుకొచ్చావో భయం లేకుండా నాతో చెప్పు." అని అడిగాడు మన దెయ్యం .

"ఎందుకంటే.... ఎందుకంటే......."

భయంతో వణికాడు ఆ యువకుడు.

"ఎందుకంటే నేను ఆ మర్రిచెట్టు దగ్గరకు వెళ్లాలి" అన్నాడు.

"మర్రిచెట్టు దగ్గరికా?" ఆశ్చర్యంగా అడిగాడు దెయ్యం. "ఆ చెట్టు మీద భయంకరమైన దెయ్యాలున్నాయని నీకు తెలియదా?" అని అడిగాడు.

"అవును. నాకు తెలుసు. కాని జీవితాంతం ఆకలితో బాధపడేకంటే చావడమే మేలు" అన్నాడాయువకుడు.

"నేను నీకు స్నేహితుడిని. నువ్వు కాస్త నెమ్మదించు. నాకు అంతా వివరంగా చెప్పు. ఒక వేళ నేనేమైన సాయం చేయగలనేమో" అన్నాడు దెయ్యం.

"నాకు ముసలి తల్లి ఉంది. ఆమెకు తిండి పెట్టాలి. నేనే ఆమెను చూసుకోవాలి. నేనే రోజూ వస్తులుంటున్నాను. వేం ఇద్దరం ఆకలితో మాడుతున్నాం. మా గుడిసె పన్ను కూడా నేను కట్టాలి. మా తండ్రి చనిపోయాడు. నా బట్టల పరిస్థితి చూడండి. నా దగ్గర ఈ ఒక్క జత బట్టలే ఉన్నాయి. ఇవి కూడ రెండేళ్ల క్రితం మా నాన్నగారు చనిపోయే ముందు నాకు ఇచ్చినవి. ఇలా పిచ్చివాడిలా ఆ యువకుడు చెప్పుకుంటూ పోయాడు. 'నా దీనమైన ముఖం, బక్క శరీరాన్ని చూడండి. నేను పడుచువాడిలా కనిపిస్తున్నానా? అయితే నాకు ఇరవై ఏళ్ళకంటే ఎక్కువ లేవు. నేను బిచ్చగాడిని కాదు. భిక్షాటన చేయడానికి అభిమానం అడొస్తోంది. నేను చిన్నవాడినయినా వేదాలన్నీ చక్కగా చదువుకున్నవాడ్ని. పండితుడంతటి వాడిని. కాని గ్రామంలోని పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులున్నారు. ఇక పూజా పునస్కారాలు చేయడానికి ముసలి పూజారులే చాలామంది వున్నారు. అకలితో చావమని నా తల్లిని ఒంటరిగా వదిలేసి ఈ గ్రామంనుంచి నేను వెళ్ళిపోలేను. అవునా మరి"? అని ఆఖరి మాటలు అరచి ఊపిరి తీసుకోడం కోసం ఆగాడు.

అప్పుడు మన బ్రహ్మాదిత్యుడు ఇలా అన్నాడు. 'ఓ నా ప్రియమైన స్నేహితుడా! నువ్వెంతగా బాధల్లో ఉన్నావో నాకు అర్థం అవుతోంది. కాని ఆ మర్రి చెట్టు దగ్గరకు నువ్వెందుకు వెళ్లాలి? అక్కడికి వెళ్లి ఆ దెయ్యాల బారి పడి చావడమెందుకు?"

"ఎందుకంటే ఈ రాత్రికి నేను ధైర్యవంతుడైన మనిషిలా చావడమో లేక, బ్రతకడమో జరగాలి" అన్నాడు ప్రహ్లాదుడు.

"నాకేం అర్థం కావడం లేదు" అని ఆత్రుతగా అన్నాడు దెయ్యం.

"నేను ఆ చెట్టు దగ్గరకు వెళ్లాలి. దాన్ని ఎక్కాలి. దాని పెద్ద కొమ్మ నొక దాన్ని విరిచి తెల్లారేలోగా మా ఊరి భూస్వామికి ఇవ్వాలి. అలా చేస్తే తన ఆస్థిలో వంద భీగాల భూమి బహుమతిగా ఇస్తానని ఆయన గ్రామస్థుల అందరిముందూ 'కాళీ' సాక్షిగా ప్రకటించడం. ఆ భూమిలో పంట కోతకు సిద్ధంగా వుంది. గ్రామంలో ఎవ్వరూ ధైర్యంగా ముందుకు రాలేదు. నేను ఒప్పుకున్నాను. ఇప్పుదర్థమయిందా?" అన్నాడా యువకుడు.

"కాని దెయ్యాలు నిన్ను చంపేస్తాయి. అది వాటికి చెందిన చెట్టు. నీకు అర్థం కావడం లేదా?" అడిగాడు బ్రహ్మాదిత్యుడు.

"అయితే నన్ను చావ నివ్వండి." జవాబిచ్చాడా యువకుడు." ఈ రాత్రితో నా పనయి పోతుంది. బీదరికం వల్ల కలిగే కష్టాలు, అప్రదిష్టకంటే చావే నయం" అనుకుంటూ తడబడే అడుగులతో మర్రిచెట్టు వైపు పోసాగాడు.

అతని దారికి అడ్డువస్తూ బ్రహ్మాదిత్యుడు ఇలా అన్నాడు. "యువకుడా! తొందర పడకు. నీ తల్లి గురించి ఆలోచించు. ఆమె కష్టాలన్నీ భరిస్తున్నప్పుడు నువ్వెందుకు భరించలేవు? నువ్వు ఈ రాత్రికి ఏం చేయదల్చుకున్నావో నీ తల్లికి చెప్పావా?"

"లేదు. నాకు మనసొప్పలేదు. ఈ విషయం తెలిస్తే ఆమె నా కూడ వచ్చేసేదే. కాని నేను ఒక్కడినే ఇక్కడికి రావాలని షరతుకదా?" అన్నాడు ప్రహ్లాదుడు.

"ప్రహ్లాదుడా! నీ ధైర్యానికి మెచ్చుకుంటున్నాను. నీ ఆత్మాభిమానాన్ని గౌరవిస్తున్నాను. నాకో విషయం చెప్పు. జీవనాధారం చూపించే స్నేహితులెవరూ నీకు గ్రామం మొత్తంలో లేరా?" అని బ్రహ్మాదిత్యుడు అడిగాడు.

నా స్నేహితులు కూడ నాలాగే పేదవారు. ఇలాంటి నిస్సహాయ పరిస్థితిలోనే ఉన్నారు" యువకుడు జవాబిచ్చాడు. తర్వాత నెమ్మదిగా ఇలా అన్నాడు. "వాళ్లందరికీ నేనంటే ప్రేమే. ఈ రాత్రి నేనిలా మరణించడం వారికే మాత్రం ఇష్టం లేదు. ఇలా చెయ్యొద్దని వాళ్లు నన్ను బతిమాలు కున్నారు. కాని... కాని... ఒకమ్మాయి 'జీవితాంతం బీదరికంలో ఉండేకంటే అదే నయం' వెళ్లమంది. ఆమె నిర్భాగ్యపు తండ్రి, క్రూరురాలైన పిన్ని ఆమెని ఆపకుండా ఉంటే నాతోపాటు వస్తాననే అంది. ఆమె ఇంకా ఇలా అంది. 'ఏదో ఒక రోజు ఆత్మహత్య చేసుకుని పేట్నీ పిశాచంగా మారతాను. ఈ బానిస బ్రతుకు కంటె అదే నయం'. ఆమె నాకు నిజమైన స్నేహితురాలిగా భావిస్తున్నాను." ఒక నిజమైన దెయ్యం ముందున్న విషయాన్ని ఆ యువకుడు ఎప్పుడో మర్చిపోయాడు.

"ఇక్కడకు బయల్దేరే ముందు ఆ అమ్మాయితో నువ్వేం చెప్పావు." అడిగాడు దెయ్యం. కొన్ని సంవత్సరాల క్రితం వకుళ వృక్షం కిందకు వచ్చే పిల్లల్లో చాల విచారంగా ఉండే ఒకే ఒక్క పిల్ల అతనికి గుర్తుకొచ్చింది.

ప్రహ్లాదుడు సిగ్గుపడుతూ నవ్వుతూ ఇలా అన్నాడు, "నేను .... నేను ఆమెకు చెప్పాను... అంటే నేను పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేసాను. అయితే ఈ సాహసకృత్యంలో నేను సఫలీకృతుడనయితేనే."

"మంచి పని చేసావు. నువ్వు నీ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటావు. నేను తిరిగొచ్చే వరకు ఇక్కడే ఉండు" అని ఆనందంగా అన్నాడు మన దెయ్యం.

అప్పుడు బ్రహ్మాదిత్యుడు అక్కడ నుంచి అదృశ్యమయ్యాడు. కొద్దిసేపట్లోనే మర్రిచెట్టు దగ్గర అతని గొంతు వినిపించింది. "ఓ పాపాత్మ ప్రేతాత్మలారా? ఓ పాపులారా! ఓ భూతాల్లారా! ఈ చెట్టు మీద నివసించే ఆత్మలన్నీ వినండి. నేను వచ్చాను" అని అరిచాడు.

దానికి జవాబుగా మర్రిచెట్టు మీద భయంకరమైన గోల మొదలయింది. ఆ శబ్దం విని వకుళ వృక్షం క్రింద నున్న యువకుడు వణికిపోయాడు. ఆ గోల కొంచెం నెమ్మదించగానే మన దెయ్యం" "మర్రిచెట్టు మీద ఉండే సమస్త దెయ్యాల్లారా! నా మాట వినండి. నేనిప్పుడే ఒక యువకుడిని ఇక్కడకు పంపుతాను. అతనికి మీ చెట్టు కొమ్మ ఒకటి కావాలి. అతనికి కావలసిన కొమ్మని మీరు విరగొట్టి, క్రిందికి తీసుకొచ్చి చాల మర్యాదగా అందచేయండి. మీరు అతనికి ఏ మాత్రం హాని కలిగించినా నేను మిమ్మల్ని శపిస్తాను. మిమ్మల్నందర్నీ భయంకరమైన నరకానికి పంపిస్తాను. అప్పుడు మీకీ ప్రపంచంలో వున్న స్వాతంత్రం పోతుంది. నేను చెప్పినదంతా గుర్తుంచుకొని ఆ విధంగా చెయ్యండి. వినిపించిందా మీ కందరికీ" అని హెచ్చరించాడు.

"అలాగే! అయ్యా! అలాగే! మేం అలాగే చేస్తాం" అని జవాబిచ్చింది.

ప్రహ్లాదుడు ఎంచుకొన్న కొమ్మ గ్రామంలోని భూస్వామి ఇంటి వరకు తీసుకెళ్లడానికి వీలుగా పెద్ద ఎత్తు, బరువు లేకుండా ఉంది. కాని దెయ్యాలు దాన్ని

చెట్టు నుండి విరగొట్టినపుడు మాత్రం పెద్ద శబ్దం వచ్చింది. మర్నాడు ఉదయం భూస్వామి, గ్రామస్థులు పరీక్షించడానికి వచ్చినప్పుడు మాత్రం కొమ్మ విరిచిన ప్రదేశం చక్కగా కనిపిస్తుంది.

దెయ్యాలు కొమ్మని విరచి కింద పారేయలేదు. జాగ్రత్తగా మోసుకొచ్చి ప్రహ్లాదుడి పాదాల దగ్గరుంచాయి. అప్పుడు వాటిలో ఒక దెయ్యం ముందు కొచ్చి "అయ్యవారు అనుమతిస్తే గ్రామం వరకు ఆ కొమ్మని మోసుకొస్తాను" అని చెప్పింది. ప్రహ్లాదుడు ఆ దెయ్యానికి, మిగతా దెయ్యాలన్నింటికి కృతజ్ఞతలు తెలుసుకొని ఆ కొమ్మని భుజాన వేసుకున్నాడు.

బ్రహ్మాదిత్యుడు తన చెట్టు కిందే ఎదురు చూస్తున్నాడు. ప్రహ్లాదుడు అతనితో కృతజ్ఞతా పూర్వకంగా ఇలా అన్నాడు." నాకు సాయం చేయటంలో మీరు చేసినదంతటికీ నేను మీకు ఎంతో రుణపడి ఉన్నాను. నేను మిమ్మల్ని గౌరవంతో మామయ్యా అని పిలుస్తాను. మీరేమీ అనుకోరుకదా! మామయ్యా! నేను మీకు ఒక విషయం చెప్పాలి. అయితే ఎలా చెప్పాలో అర్థకావడం లేదు. మీరు వస్తే బావుంటుంది. ...... అంటే మీరు తప్పక నా పెళ్ళికి రావాలి. మీరు చూపించిన దయకి నేనెంతో రుణపడి ఉన్నాను. మామయ్యా! మీరు తప్పక రావాలి. మీరు నిరాకరించకండి. మీకు వేరే వాళ్లతో కలవడం ఇష్టం లేకుంటే నేను మీ కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తాను. అంటే ఎలాగూ...... మీకూ, ఇతరులకి చాల తేడా ఉంది. నే చెప్పేది మీ కర్థమయిందనుకుంటాను. మీరు తప్పక వచ్చి, మాతో కలిసి భోంచేయాలి. మమ్మల్ని ఆశీర్వదించాలి. నా భార్యే మీ కోసం వంట చేస్తుంది. అలా చేస్తే చాల బావుంటుంది. నా భార్య మిమ్మల్ని చూసి భయపడదు, కాదు, అంటే నా కంటే ఆమెకు ధైర్యం ఎక్కువ. ఆమె తండ్రి, సవతి తల్లి ఆమెచేత ఎలా పనిచేయించు కుంటారో మీరు చూడాలి. ఆమె తల్లి దెయ్యంగా మారి ఆమెకూడ తిరుగుతుందని వాళ్లు గుసగులాడుతారు".

"వాళ్లు ఇంకా అలా వాగుతూనే ఉంటారా?" అని ఆత్రుతగా అడిగాడు బ్రహ్మాదిత్యుడు.

"అవును మావయ్యా! వాళ్లు ఇప్పటికీ అలానే మాట్లాడుతారు. అందువల్ల ఆమెని పెళ్లాడడానికి ఎవరూ ముందుకు రారు, అందువల్ల ఎప్పటికి ఆమె వాళ్ల బానిసగా మిగులుతుంది. అయితే వాళ్లు చెప్పేదంతా నిజమేనని ఆ అమ్మాయి కూడ అంటుంది. ఆమె తల్లి ఆత్మ తనని రక్షిస్తోందని ఆమె నమ్మకం. కాని అది నిజం కాదు మావయ్యా! వాళ్లు చెప్పేదంతా విని ఆ అమ్మాయి చిన్నప్పుడు అలాంటి కలలే కనేది. అప్పట్ను ంచీ అదే నిజమని నమ్ముతోంది" అన్నాడు ప్రహ్లాదుడు.

"అవును నాయనా! అదే నిజం' అని దయగా చిరునవ్వు నవ్వాడు బ్రహ్మాదిత్యుడు. కాని అది ఆమె తల్లి ఆత్మ కాదు. ఆమె తల్లి మరణించగానే స్వర్గానికి చేరుకుంది. సవతి తల్లిలా కాకుండా ఆమె తల్లి చాల పుణ్యాత్మురాలు. ఒకసారి ఈ చెట్టు కింద నేనే సవతి తల్లిని శిక్షించాను. అయితే ప్రస్తుతం నేను వకుళ వెంట ఉండటం లేదు. ఎందుకంటే దానివల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ ఉంది. ఆ అమ్మాయి పేరు వకుళ కదూ"? అని ప్రశ్నించాడు.

బ్రాహ్మణ యువకుడికి పట్టలేనంత ఆనందం కలిగింది. అతను గట్టిగా ఇలా అన్నాడు. "మావయ్యా! మీకు ఆ అమ్మాయి బాగా తెలుసు. మీరు తప్పకుండా మా పెళ్లికి రావాలి. మావయ్యా! ఆమె చాల సంతోషిస్తుంది. మీరు చేసిన సాయం వల్ల నేనిప్పుడు

ధనవంతుడనవుతాను. మా ఇద్దర్నీ మీరు ఆశీర్వదించాలి మరి.”

“నేను ఈ ప్రపంచాన్ని వదిలి స్వర్గానికి పోవలసిన సమయం ఆసన్నమయింది. ఆనందంతో తబ్బిబ్బవుతూ అన్నాడు బ్రహ్మాదిత్యుడు. “నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఎందుకంటే నువ్వు వచ్చి నాకు విముక్తి కలిగేలా చేసావు. దేవుడే నిన్ను నా వద్దకు పంపించాడు. దేవుడికి ధన్యవాదాలు. నీకు నా ఆశీస్సులు. నువ్వు ధనవంతుడివై, ఆనందంగా ఉన్నప్పుడు భగవంతుడు సదా నిన్ను కాపాడుతూ ఉంటాడు. ధనం, ఆనందం ఉన్నప్పుడే నీకు భగవంతుడి తోడు అవసరం. మర్చిపోవద్దు. నీ ప్రియ వకుళకు కూడా నా ఆశీస్సులు. నీతో ఆమెకు ఆనందకరమైన, ఆరోగ్యవంతమైన చిరకాల జీవితం కొనసాగాలని ఆశీర్వదిస్తున్నాను. బంగారం లాంటి పిల్లలు కలగాలని ఆశీర్వదిస్తున్నాను. అన్నిటికీ భగవంతుడి దయ ఉండాలి. అతన్ని సదా స్మరించండి అన్నాడు బ్రహ్మాదిత్యుడు.

కొన్ని సెకనుల పాటు బ్రహ్మాదిత్యుడు ధ్యానంలో ఉన్నట్టు మౌనంగా ఉన్నాడు. తర్వాత నెమ్మదిగా అదృశ్యమయ్యాడు. అదే సమయంలో ఆ చెట్టు శిఖరాన ఉన్న వెలుగు కూడా మాయమయ్యింది.

కొంచెం సేపు కలగంటున్నానేమో అని అనిపించిందా యువకుడికి. అప్పుడే అకస్మాత్తుగా భయంకరమైన రొద. అతనికి మెలకువ వచ్చేలా చేసింది. ఆ శబ్దం ఆ పెద్ద మర్రిచెట్టు నుంచి వస్తోందని అతనికి తెలుసు. యువకుడు కాస్త వణికాడు. తర్వాత మర్రిచెట్టు కొమ్మ భుజం మీద వేసుకొని తన గ్రామానికి వేగంగా పరుగెత్తాడు.

– డా॥ రోష్నీ (చిత్రప్రసాద్ కథలు)

---

శతకం



## వేమన శతకము

***గంగిగోవు పాలు గరిటడైనను చాలు***
***కడివెడైన నేల ఖరముపాలు***
***భక్తికలుగు కూడు పట్టెడైననుజాలు***
***విశ్వదాభిరామ వినుర వేమ***

**భావం:**

కడవ నిండా ఉన్న గాడిద పాలు కంటే చక్కని ఆవు పాలు ఒక్క గరిటెడు ఉన్నా సరిపోతుంది.

❖

**ఆత్మ శుద్ధిలేని యాచార మదియేల**
**భాండ సుద్ధిలేని పాకమేల**
**చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా**
**విశ్వదాభి రామ వినుర వేమ**

**భావం:**

మనసు నిర్మలంగా లేకుండా దుర్బుద్ధితో చేసే ఆచారం ఎందుకు?
వంట పాత్ర శుభ్రంగా లేని వంట ఎందుకు?
అపనమ్మకంతో దురాలోచనతో చేసే శివ పూజ ఎందుకు?
(ఇవన్నీ వ్యర్థ అని వేమన భావన)



# నింగి నేల మాదే

రాజాపూర్ అనే ఊరిలో ఒక పేద కుటుంబం ఉండేది. వారికిద్దరు పిల్లలు. బాబు రాజేష్, పాప లత. ఇద్దరు చదువుతో పాటు ఆటలంటే ఇష్టపడేవారు. రాజేష్ కు జాతీయస్థాయిలో క్రికెట్ ఆడాలనేది కోరిక. కాని దానికోసం డబ్బు ఖర్చు అవుతుందని.. అకాడమీలో శిక్షణ తీసుకోవాలని చెప్పారు. దీంతో తను పూర్తిగా చదవడంపై ఆసక్తి పెంచుకున్నాడు. అయితే చెల్లె లతకు ఆటల మీదున్న ఆసక్తి గమనించిన రాజేష్.. క్రికెట్ తానే నేర్పడం మొదలు పెట్టాడు. తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా, రాజేష్‌ను తిట్టినా లతకు క్రికెట్ నేర్పడం వదల్లేదు.

అటు రాజేష్ ప్రోత్సాహంతో లత క్రికెట్‌లో మెలుకువలు నేర్చుకునేది. లతకు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. చుట్టుపక్కల వారు, బంధువులు అబ్బాయిల ఆట ఈ అమ్మాయి ఎలా ఆడుతుంది.. రాజేష్‌కు పిచ్చి లేసిందా అంటూ ఎగతాళి చేస్తూ మాట్లాడేవారు. కాని రాజేష్ అవేం పట్టించుకునేవాడు కాదు.. లతను కూడా మంది మాటలు పట్టించుకోవద్దని చెప్పేవాడు. కొద్ది కాలంలోనే లత జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో స్థానం సంపాదించడమే కాకుండా మంచి పేరు సంపాదించింది. దీంతో రాష్ట్ర స్థాయి క్రికెట్ టీంకు ఎంపికైంది. మొదట్లో ఆడే అవకాశం రాకున్నా నిరాశ చెందకుండా అవకాశం కోసం చూసింది. అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని వాడుకున్న లత బ్యాట్, బాల్‌తో రాణించి అందరిని ఆశ్చర్యపరిచింది. దీంతో ఆమె వెనుదిరిగి చూసే అవకాశం లేకుండా పోయింది. జాతీయ జట్టుకు ఎంపికయింది, అయితే కనీసం ఖర్చులకు డబ్బులు కూడా లేని పరిస్థితి.. రాజేష్ స్నేహితులు సహాయం చేయడంతో లత జాతీయ స్థాయి పోటీలకు వెళ్లింది. అప్పటిదాక లతను నిందించిన వాళ్లు తర్వాత వాళ్ల పిల్లలకు క్రికెట్ నేర్పించడం మొదలుపెట్టారు. వారి కోచ్ ఎవరో కాదు రాజేష్.

– షిఫా నౌసీన్,
కేశవపట్నం





# మట్టి పాత్రలు తయారీ

పల్లెలే భారతదేశపు పట్టుకొమ్మలు అన్నారు మహాత్మా గాంధీ. మనది ప్రధానంగా వ్యవసాయక దేశం. వ్యవసాయం - దానికి అనుబంధంగా వున్న ఉత్పత్తి పరికరాలన్నీ చేతివృత్తుల వారి శ్రమఫలితమే. గ్రామీణ జీవన విధానంలో చేతివృత్తులదే ప్రధాన పాత్ర.

వడ్రంగం, కమ్మరం, చేనేత, మేదరి, ఆభరణాల తయారీ, వంటపాత్రల తయారీ, గృహనిర్మాణం, పాదరక్షల తయారీ వంటి అనేక చేతివృత్తులతో గ్రామీణ జీవితం పరస్పర సహానుభూతితో ప్రశాంతంగా, ఆనందంగా ఉండేది. అలాంటి చేతి వృత్తులలో మట్టి పాత్రలు చేయడం ప్రధానమైనది. ఈ వృత్తి చేసేవారిని కుమ్మరులు అంటారు.

వ్యవసాయ దారులు పండిన పంటను నిలువ చేయడానికి, ఇతర అవసరాలకు ఉపయోగించే పెద్దపెద్ద గోళాలు, కొట్టెలు, బింకులు, బానలు, వంటపాత్రలైన కుండలు, మూకుళ్ళు, చట్టీలు, నీళ్లు నిలువ చేయడానికి, చల్లపరిచేందుకు కూజాలు, రంజన్లు, రాత్రి వెలిగించడానికి బుడ్డీలు, దీపాలు, ప్రమిదలు, పచ్చళ్లు నిలువ చేయడానికి పచ్చడి కుండలు, కల్లు దుత్తలు, పూలను, మొక్కలను పెంచేందుకు కుండీలు, తొట్టెలు, సంగీత పరికరం ఘటం (మృదంగం) ఇలా వివిధ అవసరాలకు అవసరమైన మట్టి పాత్రలు వీళ్ళు తయారు చేస్తారు.

**మట్టి పాత్రలు తయారు చేయు విధానం:**

ఈ వృత్తి చేసే వారి ఇంటి నిర్మాణమే ఈ వృత్తికి అనుగుణంగా వుంటుంది. ఇంటిముందు సారె, ఇవి కాల్చడానికి అవసరమైన వాము ఉంటాయి. కుటుంబ సభ్యులందరూ స్త్రీలు, పిల్లలూ వీటి తయారీలో పాలు పంచుకుంటారు. మట్టి పాత్రల తయారీకి ముడి పదార్థం ఒండ్రుమట్టి. దీనిని బంకమట్టి అని కూడా అంటారు. ఇది క్షారస్వభావం కలిగి ఉంటుంది. దీనిలో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, పాస్పర్, సోడియం, బోరాన్, మాంగనీస్, జింక్, కాపర్, ఐరన్, సిలికాన్ మొదలైనవి ఉంటాయి. ఈ లవణాల రసాయన చర్యలవల్ల మట్టి పాత్రలు కాల్చిన తరువాత గట్టిగా తయారవుతాయి. ఈ లవణాల కారణంగా ఒండ్రు

మట్టిని అనేక విధాలుగా విభజిస్తారు. ఈ మట్టిని చెరువుల నుండి, కుంటల నుండి, పారే నీటి ఒడ్డు నుండి సేకరిస్తారు. దానిని ఆరబెట్టి, జల్లించి, దానిపైన నీళ్లు చల్లి మెత్తగా కాలితో తొక్కుతారు. మట్టి జిగటగా మారుతుంది. ఈ మట్టిని కుమ్మరి చక్రం (సారె) యొక్క మధ్యభాగంలో పెద్ద ముద్దలా పెట్టి చక్రాన్ని కర్రసాయంతో తిప్పి, మట్టిని చేతితో ఒత్తిడితో కదిలిస్తూ వివిధ ఆకారాలలో మలుస్తారు. పుల్లను, నీటిని ఉపయోగించి ఆయాపాత్రలకు మెరుగులు దిద్దుతారు. పూర్తయిన కుండను పదునైన ఇనుప చువ్వతోనూ, పదునైన కత్తితోనూ చక్రం నుండి వేరు చేసి జాగ్రత్తగా పక్కన పెడతారు. వాటిని నీడలో ఆరబెట్టి 'సల్వ' 'గుండు' అనే పరికాలతో ఆకృతులను ఇస్తారు. సృజనాత్మకత, నైపుణ్యం మీద ఆధారపడి ఇవి అందాన్ని సంతరించు కుంటాయి. తరువాత వాటిని వాముతో కాలుస్తారు. ఇవి కాల్చుడానికి సహజమైన కట్టెలు, పిడకలు, కంప ఉపయోగిస్తారు. ఏ ఇంధనాలు వాడరు. తరువాత వీటిని ఉపయోగించవచ్చు. ఈ మట్టి పాత్రలను ప్రపంచంలోనే అనేక దేశాలు ఉపయోగిస్తున్నాయి. ఈ ఆధునిక కాలంలో మట్టి పాత్రల వినియోగం పూర్తిగా పోయింది. గ్యాస్‌మీద, లోహ పాత్రల్లో వంట అనేక అనారోగ్యాలకు దారితీస్తుంది. ఇంధనాలు, లోహాలు పర్యావరణ సమతుల్యతకు హానిగా పరిణమించాయి. మట్టి పాత్రలను యంత్రాలతో చేస్తున్నారు. వివిధ సాంకేతికాభివృద్ధిలో భాగంగా చేతివృత్తులు దెబ్బ తిన్నాయి. గ్రామీణ జీవితం రూపురేఖలు మారిపోతున్నాయి.

మట్టిపాత్రలు ఇవాళ షోకేస్‌లలో బొమ్మలుగా మారి పోయాయి. పర్యావరణ చైతన్యం పెరుగుతున్న ఈ రోజుల్లో కొన్ని అవసరాలకైనా మట్టి పాత్రలను ఉపయోగిస్తున్నారు. వీటిని ఉత్పత్తి దారులైన కుమ్మరుల



వద్ద కాకుండా నగరాలలో పెద్ద పెద్ద మాల్స్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

భారత ప్రభుత్వం 'పర్యావరణ మిత్ర ఉత్పత్తి'గా మట్టికుండను గుర్తించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోలు బోర్డువారు ఎకోమార్క్ స్కీమ్ ప్రారంభించారు. 'మట్టికుండ' ఎకో మార్క్ లోగోగా ఎన్నుకోబడింది.

ప్రభుత్వం మట్టిపాత్రల వాడకాన్ని ప్రోత్స హించాలి. వీటి వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలం పెంచుట, సహజ వనరుల సంరక్షణ, భూసార సంరక్షణ, గ్రామీణ ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, వృత్తిదారులు, ప్రజలు పరస్పర సహకారంతో వృత్తిని సంరక్షించడానికి సమిష్టి కృషి చేయడం సామాజిక బాధ్యతగా భావించాలి.

**– జుగాష్ విలి**



# వృక్షో రక్షతి రక్షితః

తాతయ్యా!" ఇంటి గుమ్మంలోకి రాకముందే సంబరంతో పరుగెత్తుకొస్తున్నాడు పరమేశ్వర్ మనవడు తొమ్మిదేళ్ల రాహుల్.

వరండాలో వాలు కుర్చీలో కూచున్న తాతయ్య ఆశ్చర్యంతో చూస్తూన్నంతలోనే "తాతయ్యా! స్వాతంత్రదినోత్సవ సందర్భంలో జరిపిన కప్ప గంతుల ఆటల పోటీలో నాకు ఫస్టుప్రైజు. ఇదిగో బంగన్ పండ్ల మామిడి మొక్క" అంటు తన తాతయ్య చేతిలో పెట్టాడు

ఆ మొక్క సంచీని.

అది చూసి "ఓ ఓ బాగుంది బిడ్డా! ఎక్కడ నాటుదాం? మన ఇంటి వెనకాలున్న పెరట్లో నాటుదామా?..."

"అవును తాతయ్యా!"

"వేసవికాలం రాగానే ఉక్కబోస్తాందిరా, ఈ డాబా ఇంట్లో ఉండలేక పోతున్నానురా, ఏసీ ఏమో పడదాయే, పోనీ విసరకర్ర లేవైనా ఉన్నాయంటే అవి దొరకడంలేదు, ఓ చెట్టుంటే బాగుండేదిరా!"

"మొక్క పెద్దదవగానే నీడతోపాటు చల్లని గాలినిస్తుంది."

"అవున్రా మనవడా! మనకు ప్రాణ వాయునిస్తుంది. అంతేగాక దీని కొమ్మలకు ఊయలలు కట్టి ఏంచక్కా ఊగవచ్చు. అలా గాలిలో నీవూ మీచెల్లాయి ప్రణతి, మీ నానమ్మ ఇలా అందరం తేలియాడవొచ్చు..."

"అవును మన సమస్యలన్నిటికీ చెట్లే దారి చూపిస్తాయటా తాతయ్యా! ఇవాళ్ల మాబడిలో స్వాతంత్ర దినోత్సవానికి పర్యావరణ పరిరక్షణ అధికారి ముఖ్య అతిథిగా వచ్చి ఎన్నో విషయాలు చెప్పారు తెల్సా?"

"ఏమని చెప్పాడేంటి?" అని తాతయ్య అడిగితే

"పిల్లల్లారా! రేపటి భవిష్యంతంతా మీదే, మీ నుండి ఓ రాష్ట్రపతో, ప్రధానమంత్రో, డాక్టరో, ఇంజనీరో, ఉపాధ్యాయులో కావొచ్చు. అయితే అదెప్పుడూ మీరంతా ఆరోగ్యవంతమైన వాతావరణంలో ఉన్నప్పుడే సాధ్యం. అలా ఉండాలంటే కాలుష్యంలేని ప్రాణవాయువు కావాలి.

ప్రతి మనిషికి రోజుకు అయిదువందల యాబది లీటర్ల ప్రాణవాయువు కావాలి. దాన్ని ఖరీదు చేయాలంటే కనీసం 2500/-రూపాయలవుతుంది. అంటే సంవత్సరానికి తొమ్మిది లక్షల ఖర్చు. సరాసరిగా ఒక మనిషి జీవిత కాలానికి కనీసం ఆరు కోట్ల రూపాయల ఖర్చు. అదే ఒక చెట్టు దాని జీవితకాలంలో కనీసం ముగ్గురి మనుషులకు సరిపోయేంత ఆక్సిజను అందిస్తుంది. అంటే దీని విలువ ఎంత గొప్పదో చూడండి.

సకాలంలో వర్షాలు కురువాలన్నా, భూవాతావరణం చల్లగుండాలన్నా, మనమే గాక ఫ్యాక్టరీలు, మోటారు వాహనాలు వదిలే బొగ్గుపులుసు గాలిని పీల్చుకొని ఆక్సిజన్ వదిలే చెట్లను ముమ్మరంగా పెంచాలి. అపుడే, అందరం హాయిగా, ఆరోగ్యంగా బ్రతుకగలం. ఇది మన అందరి బాధ్యతగా తెల్సుకొని ఇంట్లో ఎంతమంది సంఖ్య ఉంటే దానికి రెట్టింపుగా మొక్కలు నాటాలి. అందుకే "వృక్షాలుంటేనే సద్గతి లేదంటే అధోగతి" అని చెప్పారు.

"అవును బిడ్డా! ఆయన చెప్పింది నిజమే. ఇపుడు నేను కూచున్న ఈ కుర్చీ, అదిగో ఆ మంచం, ద్వారం దాని తలుపులూ, కిటికీలు, నీవు రాసుకునే టేబుల్, పెంకుటిండ్లకుండే వాసాలు, ఎడ్లబండ్లూ, ఓడలూ, నావలూ ఇలా అన్నీ ఆ చెట్టు కాండం కొమ్మలతోనే..."

తాతయ్య మాటలు పూర్తవ్వకముందే "అంటే ఈ మొక్క పెరిగి చెట్టై ఇలా ఉపయోగపడ్తుందా? తాతయ్యా!" అంటు ఐదు సంవత్సరాల వయస్సున్న మనవరాలు వరండాలకొస్తూ అడుగుతోంది.

'అవునమ్మా! మొన్న వారం క్రితం టివిలో చూశా.

మన మాజీ రాష్ట్రపతి కలాం గారంట రోజూ తన ఇంటి పిట్టగోడమీద తిండి గింజలేస్తే ఏంచక్కా పిచ్చుక లొచ్చి తిని వెళ్లేవే గాని, ఆ చుట్టు పక్కలెక్కడా గూడు పెట్టుకొని ఉండటం లేదట. అదే తన పెరట్లో పండ్ల మొక్కలూ, పూల మొక్కలూ నాటి పెంచితే పిచ్చుకలే కాదు, రామచిలుకలూ, కోకిలలూ, పావురాలూ, ఉడుతలూ, సీతాకోక చిలుకలు, తుమ్మెదలే కాదు, తేనె టీగలు తేనె తెట్టను పెట్టడం ప్రారంభించాయట. పక్షుల కిలకిలలు కోకిలల కుహ కుహులు ఎంతో అలరించేవట. ఇలా తన స్వానుభవంలో శరబంధం మిత్రులందరికీ చెప్పాడట మొక్కలు నాటండీ మీ మనసునానంద పర్చుకోండి అని" చెప్పింది అక్కడి కొచ్చిన రాహుల్ నానమ్మ.

"మరి ఇన్నాళ్లెందుకు చెప్పలేదేం నానమ్మ!" అని రాహుల్ ప్రశ్న. "మరిచిపోయానమ్మా! నాకు మతి మరుపొచ్చేసిందిరా! అయినా మీ తాతయ్య వొంట్లో బాగులేదు. పైగా మీ నాన్నేమో తెల్లార్లు లేచిన్నుండీ ఉరుకులూ పరుగులేనాయే..."

నానమ్మ మాటల మధ్య కల్గించుకుంటు "నేనెప్పటి నుండో చెప్తూనే ఉన్నా రసాయనాలు చల్లిన కూరగాయల కన్నా మన పెరట్లో పెంచుకునే కూరగాయలు ఆరోగ్యమని, పెరట్లోనే ములక్కాయ, కరివేపాకు, మొక్కలు నాటుకుందామని. పండుగ పబ్బాలకు మావిడి తోరణాల ఆకులకోసం పరిగెత్తే కన్నా మన పెరట్లోనే ఓ చెట్టు పెట్టుకుంటే సరిపోతుందంటే ఊహు ఎవ్వరు వినిపించుకోనైతిరి." అంటూ రాహుల్ తల్లి కృష్ణవేణి వచ్చింది.

"ఈ చెట్ల వల్ల గాలీ, నీడ లభించడమే కాదు చెట్లలో ఎన్నో ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. వీటి బెరల్లూ, వ్రేళ్లూ, కాయలు, ఆకులూ, పండ్లూ, గింజలూ, పూలూ, మొగ్గలూ ఇలా చెట్టులోని ప్రతిభాగం ఎన్నో రోగాలకు వైద్యంగా ఉపయోగ పడ్తాయి బిడ్డా!" అని తాతయ్య చెప్తుంటే.

"అందుకేనేమో గత సంవత్సరం తిరుపతి కెళ్లినప్పుడు కొండమీద అక్కడక్కడ "వృక్షోరక్షతి రక్షితః" అన్న రాతలు కనబడ్డాయి".

"అవున్రా రాహుల్ దానర్థమేంటో తెల్సా! వృక్షాలను నీవు రక్షిస్తే అవి నిన్ను రక్షిస్తాయి అని..."

"ఓ అలాగా! మన ఇంట్లో నాతోబాటు మొత్తం అర్గురం ఉన్నాం కదా! తలా రెండు మొక్కలు నాటి, వాటిని పెంచితే అవి చెట్లైతే వాటి కొమ్మలకు ఊయలలు కట్టి ఊగొచ్చు. రామచిలకల పలుకులు తుమ్మెదల జుమ్మనే నాదాలూ వినవచ్చు భలే భలే" అంటు గంతు లేస్తోంది ప్రణవి సంబరంగా.

"ఏది ఏమైనా నేను చేయని మంచి పనిని బహుమతిగా తెచ్చుకొని తెచ్చావురా నాన్నా! రేపెట్లాగో ఆదివారం సెలవేకదా! మండల ఆఫీసులో మొక్కలను ఉచితంగానే ఇస్తున్నారట. అందులో మనకిష్టమైన మొక్కలను తెచ్చి నాటేద్దాం. ఒక్కొక్క మొక్కకు ఒక్కొక్కరి పేరు పెట్టి బాధ్యత తీసుకుందాం. మన పెరటిని పచ్చదనంతో నింపేద్దాం." అంటూ రాహుల్ నాన్న అశోక్ తన కొడుకు తెచ్చిన బంగన్‌పల్లి మొక్కను పెరట్లో నాటడానికి వెళ్తుంటే తనతోబాటు పిల్లలూ వెళ్లారు గంతులేస్తూ ఉత్సాహంగా ఉల్లాసంగా.

**–దారం గంగాధర్,**
ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్



# ప్రకృతి విద్య

సిరిపురం చిన్న గ్రామం. గ్రామంలో అందరూ చదువుకోవడానికి ఒక్కటే పాఠశాల ఉండేది. ఆ గ్రామంలో రంగయ్య, లక్ష్మి అనే దంపతులకు ఇద్దరు పిల్లలు రాము, కిరణ్. రంగయ్య లక్ష్మి వ్యవసాయం చేసేవారు. కిరణ్‌కి చదువుకోవాలనే ఆసక్తి ఎక్కువ. కిరణ్ గ్రామంలోని పాఠశాలకు చదువుకోవడానికి వెళ్ళేవాడు. పాఠశాలలో జరిగే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. జీవితంలో గొప్ప స్థాయిలో ఉండాలని తన కోరిక. తన తల్లిదండ్రులను కష్టపెట్టకుండా మంచిగా చూసుకోవాలని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కిరణ్ అనుకునేవాడు. కిరణ్ కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుని.. వారికి సహాయం చేయడం కోసం అప్పుడప్పుడు పొలం పనికి వెళ్లే వాడు. ఉన్నదాంట్లోనే సర్దుకుపోయే వాడు. రోజూ పాఠశాలకు వెళ్లడం మాత్రం తప్పక పోయేది.

ఒక రోజు వాళ్ల పాఠశాలలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల ప్రదర్శన పరిశీలించడానికి ఒక అంశం మీద ఎలా చెప్తారు అని తెలుసుకోవడానికి ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కిరణ్ ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నాడు. కార్యక్రమం జరగడానికి ఒక రోజు సమయం ఉంది. కిరణ్ దేని గురించి చెప్పాలి అని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఒక రోజు గడిచిపోయింది. కార్యక్రమం మొదలైపోయింది. దానికి పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ వచ్చారు. ఏదైనా ఒక అంశం మీద లేదా వస్తువు తీసుకొని దాని గురించి వివరించాలి అని ఉపాధ్యాయులు చెప్పారు. అలా ఒక్కో విద్యార్థి వారు తీసుకున్న అంశం గురించి లేదా వస్తువు గురించి సవివరంగా వివరిస్తూ వస్తున్నారు.

అలా కిరణ్ వంతు వచ్చింది. కిరణ్ తెల్లని వస్త్రాలు తీసుకున్నాడు. అతను ఏం చెబుతాడో అని అందరూ ఆతృతతో, ఆశ్చర్యంగా చూస్తున్నారు. కిరణ్ కళ్ళల్లో ఆ వస్త్రం ద్వారా ఏదో తెలియ చేయాలని అనుకుంటున్నాడని మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. కిరణ్ ఒక ఉదాహరణ చెప్పాడు. ఎవరికైనా ఒక తెల్లని వస్త్రాన్ని ఇచ్చి దాన్ని చూసి ఏదైనా రాయమంటే ఏం రాస్తారు... దాని మీద ఒకవేళ ఎక్కడైనా చిన్న మచ్చ ఉంటే అందరూ ఆ మచ్చ గురించి రాస్తారు కానీ, ఆ తెల్ల వస్త్రం గురించి ఎవరూ రాయరు అని చెప్తాడు.

అందరి దృష్టి ఆ నల్లని మరక మీదికి వెళు తుంది. కానీ ఆ తెల్లని వస్త్రం మీద ఉండదు. మనిషి జీవితంలో కూడా అంతే. చెడు లేదా మంచి వాటిలో ఏదైనా చర్చ పెడితే అందరూ చెడు గురించి మాట్లాడతారు. ఆసక్తి చూపుతారు. మంచి గురించి ఎవరూ మాట్లాడరు. మనం చూసే దృష్టిని బట్టి ఉంటుంది అని కాకుండా చూడటం అలవాటు చేసుకోవాలి అని చెప్పాడు. స్వచ్ఛతకు చిహ్నం తెలుపు. మనిషి కూడా స్వేచ్ఛగా ఉండాలని కిరణ్ దీని ద్వారా చెప్పాడు. కిరణ్ చిన్నవాడైనా చక్కగా చెప్పాడు అని అందరూ అభినందించారు

తెలుపు వస్త్రం లేదా తెలుపుకు సంబంధించింది ఏదైనా దాని మీద ఏ చిన్న రంగు పడినా అది తన సహజత్వాన్ని కోల్పోతుంది. తన రంగు మారుతుంది. చూడటానికి బాగుండదు. మనిషి కూడా అంతే ఏ చిన్న తప్పు చేసినా ఫలితం వాళ్ళ జీవితాంతం వెన్నంటే ఉంటుంది. అందుకే ఏ తప్పు చేయకుండా ఉండాలని ముఖ్య ఉద్దేశం.

**– పి.భావన,**

వంకాయగూడెం

# బోర్లు

అనగనగా ధర్మారం అనే గ్రామం ఉంది. పచ్చని పొలాలతో చుట్టు చిన్న చిన్న వాగులతో కళకళ లాడుతుంది. రైతులు వ్యవసాయం చేసు కుంటున్నారు. 70 శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పెద్దపెద్ద బావులు తవ్వి ఆ నీళ్లతో పంటలు పండిస్తున్నారు. జీవనం సాగిస్తున్నారు.

ఒకరోజు రామయ్య పొలంబాయి పక్కన రాజయ్య 300 ఫీట్ల బోరు వేసాడు. రామయ్య బాయినీళ్లు తగ్గడం మొదలయింది. అంతకు ముందు 10 గంటలు నడిచే బాయి మోటరు 4 గంటలే నడుస్తుంది. ఏమి జేస్తం కర్మ అనుకున్నాడు. బాయి మోటారు కంటె బోరు చాలా సులభమని ఎంతసేపు పెట్టినా నీళ్లుపోస్తూనే ఉంటుందని, అలుకగని, ఎక్కువ పొలం పారించవచ్చునని, ఆటోమేటిక్‌తో ఇంటి దగ్గరుండే నడుపవచ్చని, మిగతారైతులు విన్నారు. కొంచెం దూరంలో రంగయ్య బోరువేసాడు. ఆయనకు నీళ్లు పడ్డాయి. మరికొంచెం దూరంలో ఎల్లయ్య బోరువేసాడు. ఆ బోరుకు దగ్గరలో ఉన్న లింగయ్య, చిన్నయ్య బావుల్లో నీరు తగ్గింది. బోరు బాయిలు నీళ్లు ఎక్కువ పోయడంతో వేసిన రైతులు సంబరంలో ఉన్నారు. కాని ఏండ్లక్రింద తోడిన బావుల రైతులు బాధల్లో మునిగారు. పారుకం తగ్గింది. పంట తగ్గింది.

రామయ్య కొడుకు శివయ్య నాయినా మనము గూడా బోరు వేద్దాము. అని రామయ్యతో చెప్పాడు. బిడ్డా బోర్లు అక్కడక్కడ ఎత్తిపోతున్నయట కొన్ని బోరుమోటార్లు గూడా దించేటప్పుడు తీసేటప్పుడు ఇరుక్కపోయి బోరు పొక్కలు గూడా మూసుక పోయినయట. లక్షలు ఖర్చుయితున్నయట, మోటర్లు కాలి పోతున్నయట బావులే ఎప్పుడు శాశ్వతం బిడ్డా మనకెందుకులే బోర్లు అన్నాడు.

శివయ్య కోపంతో పక్కోడు బోరేసె. వట్టికెనే మన బాయిల నీళ్లు తగ్గినయ్, మనకు వచ్చే ఊటలు వాళ్ల బోరుకుమల్లినయ్. బోరు ఏయాల్సిందే అని జిద్దు జేశాడు. సరే బిడ్డా బోరు మోటారోనికి జెప్పు అనగానే చెప్పగానే బోరుమోటారోడు వచ్చాడు. పాయింట్ జూసి బోరుద్దామని సిద్ధమయ్యారు. పొలం పక్కనున్న రాజయ్య లేసిండు. బోరుకు బోరుకు 100 మీటర్ల దూరంలో ఉండాలనే విషయం ఏవరో చెప్పంగ విని బోరుపక్కన బోరు వేయరాదంటూ లేకపోతే నేను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని హుకుంజారీ జేసిండు. నువు వేసుకుంటే ఏమిలేదు నేను వేసుకుంటెనే ఇంత ఈర్శ్యనా నీవు పరిమిషన్ తీసుకున్నావా? ఇప్పుడేమో బాగా మాట్లాడుతున్నవ్. నాబాయికి 100 మీటర్ల దూరమున్నదా నీవేసిన బోరు. నీకు సాగచ్చిన మాటలు మాట్లాడుతున్నావ్.


"నేను బతికితే జాలు ఎవడు ఏ గంగలనన్నవోని" అనుకుంటుంద్రు జనం స్వార్ధం అన్నాడు రామయ్య. నేను ఏస్త ఏమిజేసుకుంటవో జూస్తా అని బోరు వెయ్యబోతే లొల్లి. రాజయ్య, రామయ్య కుటుంబాల మధ్యలోల్లైంది. పెద్ద మనుషులు సలహా యిస్తూ రాజయ్య మూర్ఖుడు ఎందుకయ్యా ఆయనతోని కొంచెం దూరంలో పాయింట్ పెట్టు అనగానే రాజయ్య వేసిన

బోరు 300 ఫీట్లు ఏస్తే రామయ్య 400ఫీట్లు బోరువేసాడు. పుల్లు నీళ్లు గంగలా పోస్తుంది బోరు. బోరు మంచిగపడిందని ఊరంతా తెలిసింది.

ధర్మారంలో కొండయ్య, మొండయ్యలు, మల్లయ్యలు వీళ్లు కూడా బోర్లు వేస్తానని బోర్లు వేయించారు. ఊర్లో ఎకరాలు పారిచ్చే నీటి బావులు నీటిమట్టం తగ్గి తక్కువ పారడం మొదలయ్యాయి. లింగయ్య, చిన్నయ్య పొలం బావులు ఎండిపోయాయి. పంటలెండి పోయాయి. దీనితో లింగయ్య, చిన్నయ్యలు కలగలుపుకొని లక్షలు పెట్టి బాయిలు తవ్విస్తే ఇవ్వాళ్ల ఎండిపోయెకదా! కరువుల గూడా వరిపంటలు పండించుకున్నాము "లక్ష్మిదేవి లాంటి బావులకు శనీశ్వరుదు పట్టినట్టయింది." బోరుబండి తెప్పిస్తారు. లింగయ్య 450 ఫీట్లు వేస్తాడు. నీళ్లు పడ్డాయి. కాని పక్కనున్న కొమురయ్య వ్యతిరేకిస్తాడు. నాబోరుకు 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో బోరువేసాడని ఎం.ఆర్.ఓ.కు ఫిర్యాదు చేయగా అధికారులచ్చి బోరును సీల్ వేస్తారు. బోర్లద్వారా భూగర్భజలాలు అడుగంటుతాయని, భూకంపాలు వస్తాయని తెలియజేస్తారు. రెండు కుటుంబాల మధ్య లోల్లై కొట్టుకుంటారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టుకుంటారు. చివరకు పెద్దమనుషుల తీర్పుతో సద్దుమనుగుతారు.

చిన్నయ్య 500ల ఫీట్లు బోరు వేయి మనగా దుమ్ము వస్తుంది. నీళ్లు వచ్చేదాకా అంటూ 700ల ఫీట్లు వరకు పోనిస్తాడు. కాని ఏకించు నీళ్లు పడుతాయని చెప్పారు. లక్ష రూపాయలు మోటారు బిగిస్తే ఖర్చు మరియు 50వేలు వరకు బోరు పొక్క ఖర్చుతో అప్పుల పాలవుతాడు.

ఊర్లో ఒకరిని చూసి మరొకరు బోర్లు వేస్తారు. బావులు ఎండిపోయి, మరికొందరు బోర్లు వేసి ఊరిని



జల్లెడ చేస్తారు, ఒకరు 750 ఫీట్లువేస్తే మరొకరు 850 ఫీట్లు మరొకరు 1000 ఫీట్లు వేస్తే వేరొకరు 1200 పైన ఫీట్లు బోర్లు వేస్తారు. ఊర్లోని నీటి బావులన్ని ఎండిపోయాయి. తక్కువ ఫీట్లు గల బోర్లూ ఎండిపోయాయి.

చుట్టు పారే వాగొడ్లకు రైతులు బోర్లు వేసేసరికి వాగులు ఎండిపోయాయి. చివరకు ఊర్లో తాగునీరు కరువైంది. పశువులు నీరు త్రాగడానికి దొరకడంలేదు. పచ్చని పంటపొలాలు ఎడారిలా మారాయి. పంటలు తగ్గాయి. ఊరంత తల్లడమల్లడమయింది. పండుగలు




పబ్బాలకు నీళ్లు కొనుక్కునే పరిస్థితి దాపురించింది. ఆ ఊర్లకు పిల్లలనిచ్చి పెళ్లి చేయడానికి కూడా ముందుకు రావడంలేదు. దిక్కుదోచని పరిస్థితిల్లో ధర్మారం ఉంది.

ఇట్లాంటి పరిస్థితుల్లో ఊర్లో మేధావి ఉపాధ్యాయుడు రమణయ్య ఊరిలో పరిస్థితులను వాటికి గల కారణాలను తెలుసుకుని గ్రామ ప్రజలందరిని, సర్పంచ్, మిగతా అధికారులనందరిని సమావేశం ఏర్పాటు చేయించాడు. ఊర్లో కరువుకు గల ప్రధాన కారణాలు చదువులేకపోవడం, అవగాహన లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు జల్లెడగా బోర్లువేయడం, నీటిని పొదుపుగా వాడకపోవడం, సాగు విస్తీర్ణంపెంచి చెట్లు అడవులను నరకడం మొదలగు వాటిని తెలిపాడు. చేసే పనులను చెప్పుతూ ఊర్లో తూర్పున, పడమరన, ఉత్తరాన, దక్షిణాన, కుంటలు తవ్వించడంతో పాటుగా ఊరికి పొలాలకు ఎగువ ప్రాంతంలో చెఱువు తవ్వాలని సూచించాడు. వీటితో పాటు ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాల్లో, పొలాల్లో, బంజరుభూముల్లో చెట్లు నాటాలని, అడవి నరకకుండా అడవిలో పళ్లచెట్లు నాటడంతో పాటుగా నీటి నిల్వల కోసం కందకాలు తవ్వాలని వాగుల నీళ్లకు అడ్డుకట్టలు వేసి కుంటలు చెఱువులకు మళ్లించాలని, నీటిని పొదుపుగా వాడాలని అందరు నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ఇవి చేస్తే తప్ప పూర్వవైభవంతో ఉండరని తీర్మానం చేయించి అందరి సంతకాలు పెట్టించి ప్రతిజ్ఞ చేయిస్తాడు, ఊరిప్రజలంతా అధికారులు ప్రజాప్రతినిధులు ఏకమై కుంటలు, చెఱువులు తవ్వుతారు, కందకాలు తవ్వుతారు, మొక్కలు నాటుతారు. చిన్నవాగుల నీళ్లకు అడ్డుకట్టవేసి, కుంటలు, చెఱువులకు వర్షపు నీళ్లు మళ్లిస్తారు. అన్నీ నిండి ఊరంత జలపుడుతుంది. బోర్ల అవసరం లేకుండా పోయింది. కాలువల ద్వారా పంటలు పండిస్తారు. ధర్మారం ప్రజలు సుఖశాంతులతో గడుపుతారు.

**– డా॥ వాసరవేణి పరశురాం,**
సింగారం, సిరిసిల్ల,

కథ

# అసలైన 'దైవ' కార్యం




"**తా**తయ్యా! శ్రీశైలం వెళ్లారట కదా. గుడి బాగుందా?" అడిగాడు తాతయ్య ఒడిలో కూర్చొని, కారప్పూస తింటూ పదో తరగతి నందు. "చాలా గొప్ప గుడిరా. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో శ్రీశైలం కూడా ఒకటి. నల్లమల అడవిలో ఉంది. నలు వైపులా పెద్ద ప్రవేశ ద్వారాలు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవిలను దర్శించుకున్నాము. రోజూ వేలకొద్ది భక్తులు వస్తుంటారు. అంతే కాదురా. దాని చుట్టుపక్కల చూడవలసిన ప్రదేశాలు కూడా ఇరవై దాకా ఉన్నాయి" చెప్పాడు రాఘవ శర్మ ... "మేము మాత్రం అన్నీ చూడలేక పోయామురా. ఓ ఆరు గుళ్ళు చూసి, శిఖర దర్శనం చేసుకొని వచ్చాము. నాకు మోకాళ్ళ నొప్పులు కదా. మీరు మాత్రం అన్నీ చూసి రండేం. నాన్నను చూపించమను. ఎట్లాగూ కారులోనే వెళతారు కదా" అంది ఒడిలో కూర్చున్న మనవరాలి తలలో గులాబీ పువ్వు పెడుతూ శ్రీ విద్య... "నేను అడిగితే అస్సలు కాదనడు నానమ్మా. నాన్నను నేనే అడుగుతా" అంది పన్నెండేండ్ల శరణ్య.. "మీరు ముందు గూగుల్‌లో దేవస్థాన సమాచారం చూసి వెళ్ళండి. నీకు తెలుసు గదరా నందు. నెట్ చూస్తుంటావు" అన్నాడు రిటైర్డ్ ఇంజనీరయిన శర్మ గారు. "ఓ.. ఇప్పుడే చూస్తా నా టాబ్ లో తాతయ్యా" అన్నాడు ఒడిలోంచి కిందకు దిగుతూ... "అన్నీ బాగున్నాయిరా. కానీ వచ్చే జనానికే క్రమ శిక్షణ లేదు. తాగిన వాటర్ బాటిల్స్ ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, తిని పడేసే విస్తర్లు రోడ్ల పక్కన అసహ్యంగా ఉన్నాయి. నా బాధ ఏమిటంటే, నల్లమల అడవి ఐదు జిల్లాల్లో విస్తరించి ఉంది. జింకలు, దుప్పులు, కుందేళ్ళు, చిరుతపులులు, నక్కలు, తోడేళ్లు, నెమళ్లు, అడవి కోళ్ళు ఇలా వందలకొద్దీ అడవి జంతువులూ, పక్షులూ నల్లమలలో జీవిస్తున్నాయి అవి రాత్రి పూట బయటకు వచ్చి, ఆకలితో మనం తిని వదిలేసిన బొంగులు, చిప్స్ తదితర ఆహార పదార్థాలనూ తింటాయి. వాటితో పాటు ప్లాస్టిక్ కవర్లను కూడా మింగేస్తాయి. దీనితో ప్లాస్టిక్ కడుపులోకి పోయి, అరగక కడుపు నొప్పితో బాధ పడి, తన్నుకుని తన్నుకుని చివరకు చచ్చి పోతాయి. దేవస్థానం వారు ఎక్కడి కక్కడ డస్ట్ బిన్స్ ఏర్పాటు చేస్తే ఎంత బాగుంటుంది" అన్నాడు విచారంగా శర్మ గారు. "అయ్యో పాపం. నాకు కుందేళ్ళంటే చాలా ఇష్టం తాతయ్యా. అవి చనిపోతాయంటే, నాకు ఏడుపొస్తుంది" అంది ముక్కు

పైకి ఎగ పీలుస్తూ విచారంగా శరణ్య.. "నాకో ఐడియా వచ్చింది తాతయ్యా. మనమే ఆ చెత్త కుండీలు ఏర్పాటు చేస్తే....? యాత్రికులకు పర్యావరణ స్పృహ కలిగిస్తే....? ఎలా ఉంటుందంటారు?. నా పాకెట్ మనీతో ఈ పని చేస్తా" అని తన మనసులోని ప్రణాళికను చెప్పాడు..." "చాలా మంచి ఆలోచనరా. ఎవరో చేయాలని ఎదురు చూడడం కంటే, మనమే పూనుకొని ప్రకృతిని కాపాడడం చాలా మంచిది. నావంతుగా ఇదిగో పది వేల రూపాయలు" అని జేబులోంచి నోట్లు తీసి, మనవడి చేతిలో పెట్టాడు. నందీశ్వర్ వారం పాటు శ్రమించి, గుండ్రటి సిల్వర్ చెత్త బుట్టలు పెద్దవి, జంతువులు బోర్లించినా దానిలోని చెత్త వెలుపలకు రాకుండా డిజైన్ చేయించాడు గూగుల్‌లో చూసి. రంగు రంగుల స్టిక్కర్లు తయారు చేయించి వాటి మీద డస్ట్ బిన్ అని స్టిక్కర్లు అతికించాడు చెల్లితో కలిసి. వాటితో పాటు వాల్ పోస్టర్స్ వంద దాకా చేయించాడు. "ప్రకృతిని మీరు కాపాడితే, దైవం మిమ్మల్ని కాపాడతాడు". "ప్రకృతికి హాని చేస్తే భగవంతునికి అపకారం చేసినట్లే" పరిసరాల శుభ్రత తోనే శివ సాక్షాత్కారం లభిస్తుంది" "పరిసరాలు బాగుంటేనే, మనమూ బాగుంటాము" "ప్రకృతితో, దైవంతో అనుబంధం - ఆరోగ్యాన్ని ఆనందాన్ని పెంచుతుంది". "ప్రకృతిలోనే దైవం దాగి ఉన్నాడు. ప్రకృతిని కాపాడండి" ఇలా అధ్యాత్మికతనూ, పర్యావరణాన్ని మేళవించి నినాదాల పోస్టర్ స్టిక్కర్లు ఆర్డరిచ్చి తయారు చేయించాడు. పరిసరాల విజ్ఞానాన్ని తెలియజేస్తూ, యాత్రా స్థలిలో భక్తులు పాటించవలసిన నియమాల గురించి వెయ్యి కరపత్రాలు ముద్రింప చేశాడు. పర్యావరణ స్పృహ ఉన్న వాళ్ళే కావడంతో, శివచరణ్, భ్రమరాంబ దంపతులు పిల్లలు చేస్తున్న పవిత్ర కార్యాన్ని ప్రోత్స హించారు. కారులో శ్రీశైలం దైవ దర్శనానికి బయలు దేరుతూ, రాఘవశర్మ గారిని కూడా వెంట పెట్టుకుని వెళ్లారు. తాను తయారు చేయించిన డస్ట్‌బిన్‌లూ, పోస్టర్లు, కరపత్రాలు కారులో సర్దేశాడు నందు. ఉదయమే శ్రీశైలం చేరుకుని అందరూ కలిసి దైవ దర్శనం చేసుకున్నారు. వెలుపలకు వచ్చాక, తాత మనవడు కలిసి యాత్రికులు తిరిగే ముఖ్య ప్రదేశాల్లో డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తుంటే, శివ చరణ్ భ్రమరాంబ దంపతులు, గోడల మీద పోస్టర్లు అతికించ సాగారు. శరణ్య తన చిట్టి చేతులతో పర్యావరణ స్పృహ కలిగించే కర పత్రాలు పంచ సాగింది. కారులో పాతాళగంగ, హాటేశ్వరాలయం, పాలధార-పంచధార, సాక్షి గణపతి దేవాలయం, శివాజీ స్ఫూర్తి కేంద్రం, శిఖర దర్శనం మొదలైన ప్రదేశాలను చూసి , అవసరమనుకున్న ప్రదేశంలో చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. పోస్టర్లు అంటించి, పాంప్లేంట్లు పంచి యాత్రికులకు పర్యావరణ ఎరుకను కలిగించే ప్రయత్నం చేశారు. రాత్రి పది వరకూ దైవ కార్యంలా పని చేసి అన్నం తిని సత్రంలో నిద్రపోయారు. ఆ రాత్రి నందుకో కల వచ్చింది. తమ కుటుంబమంతా పర్యావరణ హితం కోసం పనిచేస్తుంటే, బాల శివయ్య కూడా తమతో పాటు కలిసి డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేస్తూ, పోస్టర్లు అతికిస్తూ, పాంప్లెంట్స్ పంచ సాగాడు. మేలుకున్న నందు తనకు వచ్చిన కలను తల్లిని లేపి చెప్పాడు, "మనం చేసిన పనిని దేవుడు కూడా మెచ్చుకున్నాడు. మంచి కార్యం కాబట్టి, తనూ మనతో పాటే ఉన్నాడు. ఈ సంకల్పం నెరవేరుతుంది. ప్రకృతి సేవే పరమాత్మ సేవ గదా" అని ఆనందంగా కొడుకు నుదురు మీద ముద్దు పెట్టుకుంది భ్రమరాంబ.

- పుప్పాల కృష్ణమూర్తి,
ఫోన్ : 9912359345




# ఉపకారం

అనగనగా ఒక పిల్లి. అది పల్లెపాలెం మీదుగా వెళ్తుంటే దానికి చనిపోయిన కోడి కనిపించింది. దానికీ రోజు పంట పండినట్లు అయ్యింది. ఎవరూ చూడకుండా పొదల చాటున పెట్టుకుని తిందామని ఉత్సాహంతో లాక్కుపోసాగింది.

ఆ పొదల మధ్య ఒక కుక్క పడుకొని

కనిపించింది. పిల్లి గుండె గుభేలుమంది.

'ఓర్నాయనో! దీని కళ్ళల్లో పడ్డానేమిటి? కొంప తీసి నాకు దొరికిన ఆహారాన్ని, నన్నూ తినేయదు కదా!' అని భయపడింది.

కాని కుక్క లేవలేదు. దాని మూలుగులు వినిపించాయి. అంత భయంలోనూ పిల్లికి బాధ కలిగింది. "కుక్కబావా! ఏమయింది నీకు? ఎందుకు మూలుగుతున్నావు?" అని అడిగింది.

"నాలుగు రోజుల నుంచి నాకు ఆహారం ఎక్కడా దొరకలేదు. తిరిగి తిరిగి అలిసిపోయాను. ఇప్పుడు లేచి వెళ్ళి ఆహారం వెతుక్కునే శక్తి కూడా లేదు. ఆకలితో ప్రాణం పోయేలా ఉంది" అంది కుక్క.

"అయ్యో! అలాగా... నాకు ఆకలి అంతగా లేదు. అయినా ఇది అప్రయత్నంగా దొరికిందని తీసుకువెళ్తున్నాను. దీన్ని నీవు స్వీకరించు. నాకు ఇంత పుణ్యమన్నా వస్తుంది," అని తనకు దొరికిన కోడిని కుక్క ముందు ఉంచి వెళ్ళిపోయింది పిల్లి.

కుక్క అంతులేని ఆనందంతో దాన్ని తిని కడుపు నింపుకుంది.

కొంతకాలం గడిచింది. ఒకరోజు కుక్క పిల్లలతో దారిన వెళుతుంటే, ఓ పిల్లి దాని పిల్లలు కనిపించాయి. దాని పిల్లలు ఎందుకో ఏడుస్తున్నాయి. ఆ పిల్లి తనకు ఇదివరకు చేసిన సహాయం గుర్తొచ్చింది. కృతజ్ఞతలు చెబుదామని దగ్గరికి వెళ్లింది.

కుక్కని చూడగానే పిల్లికి ముచ్చెమటలు పోసాయి. 'కొంపతీసి నన్నూ, నా పిల్లల్ని తింటుందా ఏమిటి?' అనుకొని, భయంతో వరుగు లంఘించుదామనుకుంది.

కానీ కుక్క అదేమీ చేయక, "భయపడకండి. నీవు ఆనాడు చేసిన సహాయాన్ని నేను ఎన్ని జన్మలెత్తినా మర్చిపోలేను. కృతజ్ఞతలు చెబుతామనే నీ దగ్గరికి వస్తున్నాను. అవునూ... మీ పిల్లలు ఎందుకు ఏడుస్తున్నాయి?" అని ఆందోళనతో అడిగింది కుక్క.

"నా దగ్గర పాలు వాటికి సరిపోవడం లేదు. ఆకలితో విలవిలలాడుతున్నాయి," అని బాధతో కన్నీరు కార్చింది పిల్లి.


"అలాగా! నేనూ తల్లినే. మీ బాధను నేను అర్థం చేసుకోగలను. నా దగ్గర పాలు పుష్కలంగా ఉన్నాయి. నీ పిల్లల్ని కూడా నా పిల్లలుగా భావించి పాలు ఇస్తాను. ఇప్పుడే కాదు, నీ పిల్లలు పెరిగి పెద్దయి పాలు మరిచేదాకా మీ బాధ్యత నేను స్వీకరిస్తాను. ఇలాగైనా నా రుణం కొంతైనా తీర్చుకోనివ్వు," అని కుక్క తన పిల్లలతోపాటు, పిల్లి పిల్లలకు కూడా పాలు ఇవ్వసాగింది.

'మేలే చేయని ఈ లోకంలో చేసిన మేలు మరిచి కీడు కూడా చేసే ఈ లోకంలో, ఇంత చిన్నపాటి మేలునే మర్చిపోకుండా ఇంత పెద్ద మేలు చేసేవాళ్ళు ఈ లోకంలో ఉంటారా!?" అని ఆశ్చర్యంతో నోటమాట రాక, 'ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి. పొందిన మేలు మరవకుండా బదులు తీర్చుకోవాలి' అనుకుంటూ ఆనందంతో ఆనందభాష్పాలు రాల్చింది పిల్లి.

– మా.శ్రీ.రాజు,

**ఉపకారం – పిల్లల కథలు**

# చంద్రయాన్ కథ



తాతయ్య ఒక కథ చెప్పవా అన్నారు పిల్లలు. వినండి సినిమా చూసినట్లు చెపుతా.

పూజ గదిల నుండి, పూజ పూర్తయిందన్నట్టుగ నైవేద్యం గంట మోగింది. అప్పటికే మనుమలు మనుమరాళ్ళు ఆకలికి ఆగలేక చిందులు వేస్తాన్రు. భార్య హారతి పళ్ళెం పట్టుకుని బయట కొచ్చింది. మేమందరం హారతి తీస్కున్నమో లేదో పిల్లలు డైనింగ్ టేబులు మీదికి ఉరికిన్రు. ఆ రోజు ఆదివారం కావడంతోటి మా అబ్బాయి, కోడలు కూడ ఇంట్లనే ఉన్నరు. ప్రతీ ఆదివారం నాడు మా

కుటుంబమంత కలిసి తినాలన్నది నేను పెట్టిన రూలు. నా మాట మా ఇంట్ల ఎవ్వరూ జవదాటరు.

పెద్దలం మేమంత తినడం మొదలు పెట్టేసరికే పిల్లలు ఇడ్లీలు తిని పాలు తాగి, పొట్ట నిండినట్టు 'బ్రేవ్' మన్నరు. ఇంగ వాళ్ళ నానమ్మ మీదకు దండయాత్రకు దిగిన్రు.

"నాయనమ్మా! ఎక్కడో ఆస్ట్రేలియాల చంద్రగ్రహణం ఏర్పడితే నువ్వు పూజ గదంతా కడిగి పూజ చేయడమెందుకు? నీ పూజ అయ్యేదాక మేము ఉపవాస ముండుడెందుకు? అసలు గ్రహణమంటే ఏందో నీకు తెల్సా?" అని మనుమడు రాజేశ్ అడిగిండు.

"రాజేశూ! చంద్రుడంటే మీరనుకుంటున్నట్టు ఒక గ్రహం కాదు. శివుని శిరంల ఉన్న దేవుడు. దేవతలు, రాక్షసులు కలిసి చేసిన క్షీరసాగరమథనం సమయంల అమృతం పుట్టింది. శ్రీమహావిష్ణువు మోహిని రూపం ధరించి దాన్ని దేవతలకు పంచుతాంటే, రాహు కేతువులనే రాక్షసులు మారువేషాలల్ల వచ్చి అమృతం తాగిన్రు, సూర్యుడు, చంద్రుడు అది చూసి విష్ణువుకు చెపితే, ఆ భగవంతుడు రాహుకేతువులను శిక్షిస్తడు. గందుకె రాహు కేతువులు, చంద్రున్ని పట్టుకుని మింగేస్తరు. గదే గ్రహణం. విష్ణువు వరం వల్ల సూర్యుడు, చంద్రుడు మల్ల బతుకుతరు. గందుకె గా గ్రహణం సమయంల గుళ్ళన్ని మూస్తరు. గ్రహణం వీడిని తర్వాత శుద్ధి చేసి పూజలు చేస్తరు. కాబట్టి మనం గూడ గ్రహణం తర్వాత పరిశుద్ధంగ పూజలు చేసినంకనె తినాలె. గది శాస్త్రం" అన్నది.

మా మనుమడు, మనుమరాలు ముసిముసిగా నవ్విన్రు. ఇంతల నా మనుమడు,

"నాయినమ్మా! మరి రాక్షసులు, దేవతలు ఇద్దరు కలిసిగా క్షీర... గదే దాని కోసం కష్టపడ్డప్పుడు ఇద్దరికీ అమృతం ఇయ్యాలె కద. దేవుడు కూడ మోసం చేసిండు కద?" అని లీగల్ పాయింట్ లేవదీసిండు పదో తరగతి చదువుతున్న రాజేశ్.

"దేవుని లీలలు మనకు తెలుస్తయా బిడ్డా? రాక్షసులకు అమృతం ఇస్తే వాళ్ల ఆగడాలు పెరుగతయి కద! గందుకె విష్ణుమూర్తి గట్ల చేసిండు కావచ్చు. నాకంత వరకే తెల్సు!" అన్నది.

ఇంతల మా ఫలహారాలయినయ్. పిల్లలను రూములకు తీస్కపోయిన. వాళ్లకు రూముల గోడకున్న ఒక మ్యాపును చూపించిన.

నేను సైన్సు టీచరుగా రిటైరయినా గూడ, ఇప్పటికీ చాలా మంది విద్యార్థులు డౌట్స్ తీర్చుకునేటందుకు నా దగ్గరకు వొస్తరు. వాళ్ల కోసం నేనొక స్టడీ రూము తయారు చేసుకున్న. దాని గోడలకు చానా మ్యాపులుంటయి.

అందుకె, మనుమణ్ణి, మనుమరాలను గా

మ్యాపుల ముందు కూర్చోబెట్టిన. ఎందుకంటె, అనుమానం వొచ్చినప్పుడే దాన్ని నివృత్తి చేయాలె.

ఇంతకు ముందు నా భార్య చెప్పింది మన ఆచారం. మన పూర్వీకులు చానా శాస్త్ర విషయాలను సామాన్య ప్రజలకు అర్థం అయ్యే రీతిలో చెప్పలేక వాటిని ఆచారాలుగ మార్చిన్రు. అక్షరాస్యత లేని రోజుల్లో దేవుని పేరుతో, ఆచారాల రూపంలో కొన్ని మంచి విషయాలను అలవాటు చేసిన్రు. అటువంటిదే గ్రహణం అన్నది ఆచారంగ ఉన్న శాస్త్రం నేను నా భార్య విశ్వాసాన్ని ఖండించను. దాన్ని సమర్థించను కూడ.

కానీ, ఆ ఆచారం వెనుక ఉన్న సైన్సును నా మనుమనికి, మనుమరాలుకు చెప్పాలని,



“రాజేషూ! రమ్యా చంద్రగ్రహణం అంటే ల్యూనార్ ఎక్లిప్స్ అంటే, ఇగో గిట్ల సూర్యుడు, చంద్రుడు ఒకే సరళరేఖల ఉన్నప్పుడు ఆ రెండింటి మధ్యన భూగోళం వచ్చినప్పుడు గీ చంద్ర గ్రహణం ఏర్పడతది. సూర్యుడు, భూమి రెండు గ్రహాలు (ప్లాంట్స్) చంద్రుడు ఉపగ్రహం (శాటిలైట్). ఈ గ్రహాలు, ఉపగ్రహాలు, వాటికి నిర్ధారించబడిన కక్ష్యలో (ఆర్బిట్)లో తిరుగుతుంటయి. గట్ల తిరుగుతున్నప్పుడు, గా మూడు ఒకే లైన్ల వచ్చినప్పుడు గ్రహణం ఏర్పడతది. గివన్నీ ఖగోళ శాస్త్రం (ఆస్ట్రాలజీ)ల ఉంటయి. గ్రహణానికి సంబంధించి చానా విషయాలున్నయి. కానీ, మీ

వయసుకు గిది చాలు" అన్న.

వాళ్ళకు ఒక చిన్న ప్రయోగం చేసి కూడ చూపించిన. సగం నల్ల రంగు వేసిన ఒక బంతిని చంద్రునిగ, ఒక ఎర్రబంతిని సూర్యునిగ, ఒక ఆకుపచ్చ బంతిని భూమిగ అనుకొమ్మని వాటిని ఒక వైరుకు గుచ్చిన. ఎర్ర బంతికి, నల్ల బంతికి మధ్య ఆకుపచ్చ బంతిని పెట్టి, ఆ బంతి కదులుతున్నప్పుడు నల్ల రంగున్న బంతిని కూడా తెలుపు రంగుకు తిప్పుకుంట గ్రహణం రావడం, కొంచెం కొంచెం గ్రహణం వీడడం కూడ ప్రాక్టికల్‌గా చూపించిన. రెండు మూడు సార్లు చేసి చూపించేటి సరికి వాండ్లకు అర్థమయింది.

"మరి నాయినమ్మ రాహువు కేతువు అన్నదేంది తాతా?" అని నా ముద్దుల మనుమరాలు అడిగింది.

"వాండ్ల పెద్దవాండ్లు వాళ్లకు గట్లనే చెప్పిన్రు. పెద్ద పెద్ద విషయాలు వాళ్లకు అర్థం కావని. మనం కూడా మనకు శాస్త్ర విషయాలు తెలిసినంత మాత్రాన పెద్ద వాండ్లను తప్పు పట్టకూడదు.

అది సరే! ఇయ్యాల జులై పదిహేడు. చంద్రగ్రహణం అయిపోయింది. కనీ, ఈ నెలల్నె, ఇంక రెండు మూడు రోజులల్లనె ఒక గొప్ప ప్రయోగం జరుగుతోంది. అదేంటిదో చెప్పండి?" అన్నాను.

పిల్లలిద్దరూ ఒక్కసారిగ,

"చంద్రయాన్-2!" అన్నరు.

"గుడ్! గిది, చంద్రయాన్-1 తర్వాత చంద్ర గ్రహం మీద మనం జరుపుతున్న రెండో ప్రయోగం. దీన్ని ఎవరు తయారు చేసిన్రు?" అన్న నా ప్రశ్నకు,

"ఇస్రో!" అని సమాధానం చెప్పిన్రు.

"ఎప్పుడు పంపుతున్నరు?"

"22 జులై!" అన్నరు.

"ఎక్కడ్నుంచి పంపుతున్నరు?"

"శ్రీహరికోట!" అన్నరు.

"అది ఊరు పేరు. అక్కడున్న అంతరిక్ష కేంద్రం పేరేంది?" అన్న ప్రశ్నకు మాత్రం బిక్క ముఖం యేసిన్రు.

"దాని పేరు సతీష్ ధవన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్! చంద్ర గ్రహం మీద 7 సెప్టెంబర్‌న 'సాఫ్ట్ లాండింగ్' అయ్యే ఈ ప్రయోగంల "విక్రమ్" ల్యాండర్ ద్వారా "ప్రగ్యాన్" అనే రోవర్ చంద్రుని మీద దిగి పదిహేను రోజుల పాటు (చంద్రుని మీద ఒక రోజు -వన్ లూనర్ డే) ప్రయోగాలు జరుపుతది. గిట్ల ఏదైన సబ్జెక్ట్ గురించి చదివినపుడు ముఖ్యమైన పాయింట్లన్ని గుర్తుంచుకోవాలె!" అని చెప్పిన.

"థ్యాంక్యూ తాతా!" అంటూ క్రికెట్ ఆటకు పరిగెత్తిన్రు.

-డాక్టర్ ప్రభాకర్ జైనీ,
హైదరాబాద్



# ఈ బాధ్యత మనందరిదీ!

అర్ధరాత్రి దాటినా సాయిధీరజ్‌కి నిద్ర రావడం లేదు. వాడి వయసు పన్నెండు. ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి నేర్పే విషయాలని తు.చ. తప్పక పాటిస్తూ, క్రమశిక్షణతో నడుచుకుంటూ ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు.

ఇంతకీ వాడు నిద్రకు దూరమవడానికి కారకుడు చిట్టిబాబు. వాడిదీ అదే వయసు. ఏడో తరగతే చదువుతున్నాడు, కాకపోతే...సాయి వాళ్ళ కాన్వెంట్‌కు

దగ్గర్లో వున్న ప్రభుత్వ పాఠశాలలో. వాడూ మంచి స్టూడేంటే. వాళ్ళమ్మ సుబ్బులు. సంపాదించే భర్త హఠాత్తుగా మరణించడంతో వున్న ఒక్క కొడుకును కూలీనాలీ చేస్తూ పోషిస్తోంది. ఆశలన్నీ వాడిపైనే పెట్టుకుని బతుకుతోంది. చిన్నప్పటినుండీ చిట్టిబాబుతో స్నేహం కొనసాగుతోంది సాయికి. స్కూల్స్ దగ్గర కావడంతో తరచూ కలుసుకుంటూనే వుంటారు.

ప్రస్తుతం ఆ చిట్టిబాబును గురించిన ఆలోచన, సాయిని కలత పెడుతోంది... భయపెడుతోంది. పదే పదే చిట్టిబాబే గుర్తుకొస్తున్నాడు.. "అసలు వాడెందు కిలా తయారయ్యాడు? ఇప్పటికి నాలుగుసార్లు చూసాడు... వాడు స్కూలు ఎదురుగా వున్న రోడ్డులోకి వెళ్ళడం... దొంగ చూపులు చూస్తూ ఎవరో ఇద్దరితో మోటర్ సైకిల్ మీద వెళ్ళటం. స్కూల్ ఇంటర్వెల్లో వాళ్ళతో ఎక్కిడికి పోతున్నాడు? ఖచ్చితంగా చెడు అలవాట్లే అయి వుంటాయి. వాళ్ళతో వెళ్ళి చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నాడా? ఛీ...ఛీ... వాడలాంటి వాడు కాదు. మరి...ఏమై వుంటుంది? ఒకవేళ... యీ మధ్య డ్రగ్స్ అంటూ వింటున్నాం... ఆ ముఠా వాళ్ళు వీణ్ణి బలవంతంగా లాక్కుపోతున్నారా? ఏమో... కానీ ఏది ఏమయినా చెడ్డపని చేసి పట్టుబడితే.. జైలుకి పోక తప్పదు. బాల నేరస్థుల జైల్లో పడేస్తారు. అప్పుడు సుబ్బులు గతేమిటి? నిజంగానే డ్రగ్స్ ముఠాకి చిక్కితే వీడికీ ఆ అలవాటు అయితే... బయటపడలేడు". అంతే, అలా అనుకోగానే సాయికి ఒళ్ళు ఝల్లుమంది. మూడు నెలల క్రితం పక్కింటి సురేషన్న మనసులో కదిలాడు. ఇంజనీరింగ్ మూడో సంవత్సరంలో డ్రగ్స్‌కు బానిస అయిపోయాడు. విషయం తెలుసుకుని పేరెంట్స్ హాస్టలు నుంచి యింటికి తీసుకొచ్చి ఎన్నో రకాలుగా కౌన్సిలింగ్ యిప్పించారు. మంచిమందులూ వాడారు. అయినా లాభం లేకపోయింది. అదను చూసి ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. పక్కిల్లేగా కిటికీలోంచి తొంగి చూసాడు తను... అదృశ్యం యిప్పటికీ భయపెడుతుంది. చిట్టిబాబు సంగతి అమ్మకి చెబితే లాభం లేదు. 'ఇలాంటి గొడవల్లోకి దూరకు... అసలే రోజులు బాగోలేవు' అంటూ తను భయపడి పోయి, తనని తిడుతుంది. అక్కకి చెప్పినా ఏం చెయ్యగలదు? డాడీ! కరెక్ట్ "ఆ ఆలోచనతో కాస్త వూపిరి వచ్చింది. సాయికి పక్కకి చూశాడు. అక్క మంచి నిద్రలో వుంది. మెల్లగా మంచం దిగి, తలుపు తెరిచి హాల్లోకి తొంగి చూశాడు. తండ్రి మాధవరావు ఏదో బుక్ చదువుకుంటున్నాడు. గట్టి నిర్ణయంతో అటు నడిచి, తండ్రికి దగ్గరగా వెళ్ళాడు. అలికిడికి అటు చూచిన రావు "ఏంటీ యింకా నిద్రపోలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు కొడుకు చెయ్యి పట్టుకుని. విషయం ఎలా చెప్పాలో అర్థంకాక తలొంచున్న సాయిని, దగ్గరగా తీసుకున్నాడు రావు.

"ఆ ఏంటి నాన్నా! ఏదన్నా ప్రాబ్లమా? స్కూల్లో ఎవరైనా ఏదైనా అన్నారా?" తల నిమురుతూ అడిగేసరికి... ఎందుకో కన్నీళ్ళు ఆగలేదు సాయికి.. కంగారు పడ్డాడు రావు. "అరే! ఏంటి నాన్నా!!" నాతో చెప్పు!" మరోసారి అడిగేసరికి గొంతు పెగుల్చుకొని, చిట్టిబాబు సంగతి అంతా పూసగుచ్చినట్టు వివరించాడు. ఆఖరున ఎలాగయినా వాడిని కాపాడాలని చెప్పాడు తండ్రికి. కొడుకులోని మానవత, స్నేహం పట్ల విలువ...దయ... యివన్నీ చూస్తూ గర్వపడ్డాడు రావు.

"సాయీ!ఏం భయం లేదు. రేపే ఇన్‌స్పెక్టర్ అంకుల్ దగ్గరకు వెళ్ళి అన్నీ విషయాలు మాట్లాడుతాను. కానీ యీ సంగతులేవీ ఎవరి దగ్గరగా అనకు. చాలా ప్రమాదం. చిట్టిబాబుకి ఏమీ కాకుండా చూద్దాం... సరేనా? వెళ్ళి పడుకో"... అంటూ తనే కొడుకును

మంచం మీద పడుకోబెట్టి వెళ్ళాడు రావు. అక్కడి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ , రావుకు మంచి మిత్రుడు. అందుకు ఆ చనువుతో అర్ధరాత్రి అని చూడకుండా, ఫోన్ చేశాడు అతనికి. సంగతి విన్న రఘునాథ్ ఏం చెయ్యాలో చెప్పాడు.

మర్నాడు బస్సులో కాకుండా స్కూల్‌కు తన వెహికల్ మీద దింపుతానని కాస్త ముందుగా సాయిని తీసుకుని బయల్దేరాడు రావు. పోలీస్ స్టేషన్‌కు కాకుండా మరో యింటి దగ్గర కలుసుకున్నాడు. రఘునాథ్ చాలా మృదువుగా సాయితో మాట్లాడుతూ విషయాన్ని విపులంగా రాబట్టాడు. కేసు అర్థమయింది. అతడికి, తన అనుభవంతో...

"చూడు నాన్నా సాయీ! ఈ విషయాన్ని పూర్తిగా మర్చిపో. ఎవ్వరి దగ్గరా పొరపాటున కూడా చెప్పకు. చివరికి చిట్టిబాబుకు కూడా చెప్పకూడదు. నువ్వు చేసిన పని ఎంతో మంచిది. ఎందరినో కాపాడుతుంది. కానీ నీ జాగ్రత్త కూడా ముఖ్యం కదా! మీ టీచర్ చెప్పే వుంటుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ.. సూర్యుని చుట్టూ తిరుగుతుందని అలాగే ప్రతి మనిషి తనను తాను కాపాడుకుంటూ యితరులను కాపాడే ప్రయత్నం చెయ్యాలి. సరేనా?! ఆల్ ది బెస్ట్ ఎండ్ థ్యాంక్యూ...!" అంటూ సాయికి షేక్ హేండ్ యిచ్చాడు.

మఫ్టీలో వున్న పోలీసులు సుబ్బులు, చిట్టిబాబుల్ని తీసుకువచ్చారు. శోకాలు పెడుతున్న సుబ్బులు నోరు మూయించారు. మంచి మాటలతో చిట్టిబాబు నుండి సమాచారం సేకరించారు. వాళ్ళ అనుమానం నిజమే అయింది. చిట్టిబాబుని బెదిరించి లొంగదీసుకుని, ఇంటర్‌వెల్ సమయంలో వాణ్ణి దూరంగా వున్న కాలేజీల్లో స్టూడెంట్స్‌కు డ్రగ్స్ పొట్లాలు యిచ్చి డబ్బులు కలెక్ట్ చేయిస్తున్నారు. వెదురు బుట్టపై మూతలో సమోసాలు పెట్టుకుని అమ్మ జూపి... బుట్టలోపలి డ్రగ్స్ పొట్లాలు... నిర్దేశిత గుర్తు చూపిన స్టూడెంట్స్‌కు యిచ్చి డబ్బులు తీసుకుని, ముఠాలోని యిద్దరికి అందించాలి. అంతా రెండు గంటల పని... చాలా పకడ్‌బందీగా చెయ్యాలి. ఏమాత్రం తేడా వచ్చినా వాడి తల్లిని చంపేస్తామని బెదురు పెట్టారు... ఓ పదిహేనురోజులుగా సాగుతోంది యీ వ్యవహారం. నెల అయ్యాక పెద్ద మొత్తంలో డబ్బు యిస్తామని చెప్పారట. అంతా ఏడుస్తూ చెప్పాడు చిట్టిబాబు. వాణ్ని ఓదార్చి ధైర్యం చెప్పాడు. రఘునాథ్ "చూడమ్మా! నీకొడుకు యీ ముఠా చేతుల్లోంచి బయటపడాలి. ఇక్కడుంటే ప్రమాదం.. వాణ్ని యీ రోజే దూరంగా వున్న గురుకుల స్కూల్లో జాయిన్ చేయిస్తాను. అప్పుడే నీకు కూడా అడ్రసు యివ్వను. ఆ ముఠా పట్టుబడ్డాకే నీకు వాణ్ణి చూపిస్తాము. నీ కొడుకు క్షేమంగా వుండాలి కదా! వాడు బాగా చదువుకొని పైకి రావడమే కదా నీకు కావాలి! ఎవరడిగినా ఏడుస్తూ వాడు చెప్పకుండా యిల్లు వదిలి పోయాడని చెప్పు. నిజం మాత్రం ఏ ఒక్కరికీ చెప్పకు. "రఘునాథ్ మాటలు పూర్తిగా అర్థం చేసుకుంది సుబ్బులు. పరిస్థితి చిట్టిబాబుకు అర్థమయింది.

ఎంతో శ్రమకోర్చి – మూడు నెలలు ఆ డ్రగ్స్ ముఠాను పట్టుకో కలిగింది. రఘునాథ్ బృందం. సమాజం పట్ల తమ బాధ్యతను ఎంతో నిబద్ధతతో నిర్వర్తించిన రావు, చిట్టిబాబు, రఘునాథ్ బృందమేకాదు.. అందుకు సహకరించిన చిట్టిబాబు, సుబ్బులు కూడా అభినందనీయులే.

– కె.ఎ.ఎల్. సత్యవతి,
మహబూబ్‌నగర్

# రాగి తట్ట

అనగనగా ఒక ఊరిలో సునీత, రంగప్ప ఇద్దరు దంపతులు ఉండేవారు. కట్టెలు అమ్ముకొని జీవనం గడిపేవారు. ఒకరోజు రంగప్ప కట్టెలకు వెళ్ళి కట్టెలను అమ్ముకున్నాడు. ఒక అవ్వ వచ్చి "అయ్యా నాకు అన్నం కావాలి ఆకలిగా వుంది. నీకు మరెప్పుడైనా డబ్బులు ఇస్తాను వంట చేసుకోవడానికి కొన్ని కట్టెలు ఇవ్వండి" అని అన్నది. రంగప్పకు జాలి వేసి "అమ్మా మా ఇల్లు దగ్గరలోనే వుంది" అని చెప్పి ఆమెను ఇంటికి తీసుకువచ్చాడు. సునీత బయటకి వచ్చి "ఎవరు ఈమె ఎందుకు పిలుచుకువచ్చావు?" అంది. రంగప్ప జరిగిన విషయం అంతా చెప్పాడు.

సునీత అంది. "ఏవండి మన ఇంట్లో ఎల్లిపాయలు నూరిన కారం నూకల అన్నం ఉంది ఆమె తింటాదో లేదో అడగండి?" "ఏంటి అయ్యా మీరు అన్నం పెట్టమంటే గుసగుసలు మాట్లాడుతున్నారు" అని అనింది. భార్య చెప్పిన విషయం చెప్పాడు రంగప్ప. అవ్వ నవ్వింది. "ఎందుకు నవ్వుతున్నావ్? అమ్మా! మీరు చేస్తున్న పనికి నాకు నవ్వు వచ్చింది". "ఎందుకు అంటే మేము దినరోజు ఇదే తింటాము" అని అన్నది అవ్వ.

సునీత అన్నం తెచ్చి పెట్టింది. ఆమె అన్నం తిని "అయ్యా అన్ని దానాలకంటే అన్నదానమే గొప్ప. నీవు ఎంత మంచి వానివో" అని రాగితట్ట ఇచ్చి వెళ్ళిపోయింది. సునీత వచ్చి ఒక అరటిపండు తట్టలో వేసింది. అప్పుడు ఆ తట్ట నిండా అరటి పండ్లు వచ్చాయి. ఏ వస్తువు దొరికితే ఆ వస్తువు వేశాడు. ఏది వేసిన ఆ తట్ట నిండా అవుతున్నాయి. ఆ ఇద్దరు దంపతులు ఎంతో ఆశ్చర్యముగా చూస్తున్నారు. ఆ అన్నం



తినిపోయిన ఆమె ఎవరో కాదు. మన ఇంటి దేవత అని తెలుసుకున్నారు.

ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేసినందుకు ఆ దేవత మనకు ఈ వరం ఇచ్చింది. అతిథులు, అనాథలకు మాత్రమే ఉపయోగిస్తామని భార్యభర్తలు ఆ రోజు నుంచే దానాలు చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు.

– పి. నీలావతి,
7వ తరగతి, తెలుగు మీడియం

# ఓ రాజ్యం కథ

శ్రీపురం అతి చిన్న రాజ్యం. ఆ రాజ్యపు భూముల్లో వజ్రాలు దొరుకుతాయన్న వదంతి వ్యాపించడంతో, వజ్రాల మీద ఆశతో, ఎన్నో రాజ్యాల రాజులు, తమ సైన్యంతో, ఆ రాజ్యంపై దండెత్తారు. ఫలితంగా, ఆ రాజ్యం సర్వసంపదలను కోల్పోయి, పేద రాజ్యంగా మిగిలిపోయింది. సుసంపన్నమైన తన రాజ్యం, సర్వం కోల్పోయిందన్న బాధతో, ఆ రాజ్యాన్నేలే రాజు అనారోగ్యం పాలయ్యాడు. అతని స్థానంలో, అతని కుమారుడైన వీరభద్రుడిని రాజుని చేశాడు. వీరభద్రుడు తెలివైనవాడు. అతను, పేదరికాన్ని తన రాజ్యం నుండి తరిమికొట్టడమే కాదు, తమరాజ్యానికి పూర్వవైభోగాన్ని తీసుకురావాలనుకున్నాడు. అందుకోసం, ప్రజలందరినీ విద్యావంతులని చెయ్యడం ఒక్కటే మార్గం అని తలచి, తానే గురువుగా మారి, వ్యవసాయ విద్య మొదలుకొని యుద్ధవిద్యల వరకు, తను నేర్చుకున్న ప్రతీ విద్యను వారికి నేర్పించాడు. అంతేకాదు, ప్రతీ ఒక్కరికీ కొత్తగా ఆలోచించడం ఎలాగో నేర్పించాడు. ఆ రాజ్య ప్రజలు, తాము నేర్చుకున్న విద్యలకు, తమ వివేకాన్ని జోడించి, కష్టపడి పని చేయడంతో, అచిరకాలంలోనే, ఆ రాజ్యం మునుపటికన్నా ఎన్నో రెట్లు సుసంపన్నమైన రాజ్యంగా మారింది.

ఇదిలా ఉండగా, పొరుగు రాజ్యమైన మహంతి రాజ్యం, తీవ్రమైన కరువు కాటకాలతో కటకటలాడింది. రాజ్యంలోని ప్రజలు ఆకలితో అలమటించ సాగారు. రోజు రోజుకీ ఆకలిచావులు ఎక్కువయ్యాయి. తన రాజ్య ప్రజల ఆకలి బాధ తీర్చడం కోసం ఏం చేయాలా అని ఆలోచిస్తున్న ఆ రాజ్యపు రాజు ప్రతాపుడికి, శ్రీపురం రాజ్య సంపద గురించి తెలిసింది. అతను వెంటనే ఆ రాజ్యంపై దండెత్తి, వారి సంపదను దోచేయాలనుకున్నాడు. ఆ సంపదతో తన రాజ్య ప్రజల ప్రాణాలు కాపాడొచ్చనుకున్నాడు. అయితే, తన వేగుల ద్వారా, శ్రీపురం రాజ్యప్రజల తెలివితేటల గురించి తెలుసుకున్న అతను, అంత తెలివైనవారిని నేరుగా ఎదుర్కోవడం ప్రమాదమని తలచి, ఒక ఉదయం, హఠాత్తుగా, తన సైన్యంతో వచ్చి, ఆ రాజ్యాన్ని చుట్టుముట్టాడు. శ్రీపుర రాజ్య ప్రజల్ని మొత్తం కలిపినా, తన సైన్యంలో పదో వంతు ఉండరని తెలిసిన అతను, ఇక వారు తనకు లొంగిపోక తప్పదనుకున్నాడు. అతను నేరుగా, రాజభవనం ముందుకి వెళ్ళి, అక్కడున్న ద్వారపాలకుడ్ని పిలిచి, “నేను మహంతి రాజ్యపు మహారాజుని, నా సైన్యంతో మీ రాజ్యాన్ని చుట్టుముట్టాను. ఇక మాకు లొంగిపోవడం తప్ప మీకు మరో దారి లేదు. లేదు మీ రాజ్యం మీకు కావాలంటే మాతో యుద్ధం చేసి గెలుచుకోమని నేను చెప్పానని మీ రాజుతో చెప్పు” అన్నాడు.

ద్వారపాలకుడు వీరభద్రుడి వద్దకు వెళ్ళే సమయానికి అతను కొందరు బాలబాలికలకు విద్యాబుద్ధులు బోధిస్తున్నాడు. ద్వారపాలకుడు



దయచేసి మాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి” అన్నారు.

తన విద్యార్థుల ప్రతిభ, తెలివితేటల మీద పూర్తి నమ్మకమున్న వీరభద్రుడు, వారిని ఆశీర్వదించి పంపాడు.

తనకు, తన సైన్యానికి భయపడి, వీరభద్రుడు పరుగుపరుగున వచ్చి తనకు లొంగిపోతాడనుకున్న ప్రతాపుడు, అతనికి బదులు, నిండా పదేళ్లు నిండని ఇద్దరు (పిల్లలు) బాలలు, చిరునవ్వుతో తన వద్దకు రావడం చూసి ఆశ్చర్యపోయాడు.

ఆ పిల్లలు అతని ముందు నిలబడి “మహారాజా నమస్కారం.

తెచ్చిన వార్తను విన్న వీరభద్రుడు, ప్రతాపుడ్ని కలిసి మాట్లాడేందుకు వెళ్ళబోయాడు. అప్పుడు ఆయన విద్యార్థుల్లోంచి ఒక బాలుడు, బాలిక లేచి.. “మహారాజా ఈ మాత్రం దానికి మీరు ఎందుకు? ఈ సమస్యను మేము పరిష్కరిస్తాము. మీరు నేర్పిన విద్యను ఉపయోగించే అవకాశం వచ్చింది.

మీరిలా హఠాత్తుగా మా రాజ్యాన్ని చుట్టుముట్టారంటే మీకు కావలసిందేదో మా రాజ్యంలో ఉందని, అది మీకు తక్షణం కావాలని అర్థం. అంతేనా” అన్నారు.

“అయితే న్యాయంగా మీకు దక్కవలసిన దాని కోసమే మీరిదంతా చేస్తున్నారా లేక అన్యాయంగా

మీది కాని దానినేమైనా పొందాలని ఆశిస్తున్నారా? మీకు న్యాయంగా రావలసినదాని కోసమే మీరిదంతా చేస్తున్నట్లయితే, ఇకమీరు ఇలా చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే అది ఏదైనా మేము దాన్ని మీకు సంతోషంగా ఇస్తాం. మా రాజ్యంలో ఏ ఒక్కరం ఇతరుల సొమ్ముకి ఆశపడం. ఇతరులకు మా వల్ల అన్యాయం జరగనీయం. మీరు కూడా అన్యాయంగా మరొక రాజ్యాన్ని దోచుకునే అవివేకులని మేం అనుకోవడం లేదు" అంది బాలిక.

వారి తెలివితేటలు, ధైర్యం, జ్ఞానం చూసి ఆశ్చర్యపోయాడు ప్రతాపుడు. వారి మంచి మాటల్ని అవకాశంగా తీసుకుని, వారు ఇవ్వలేనిది అడిగి వారి రాజ్యాన్ని వారే తనకి అప్పగించేటట్లు చేసుకుందామనుకున్నాడు.

"మీరు చిన్న పిల్లలు కనుక మిమ్మల్ని పెద్దపెద్దవేవీ అడగలేను. కాకపోతే నాకో చిన్న కోరిక ఉంది. అది తీరిస్తే నేను ఈ రాజ్యాన్ని మీకప్పగించి వెళ్తాను. లేని పక్షంలో యుద్ధం తప్పదు" అన్నాడు.

"అదేమిటో సెలవివ్వండి" అన్నారు ఆ బాలలు.

"నాకు వరిచేనులో ఈదే చేపల్ని, వలవేసి పట్టి తెచ్చి ఇవ్వండి. ఆ చేపల్ని మీ రాజ్యపు కానుక అనుకుని, వాటిని తీసుకుని ఆనందంగా వెనుతిరిగి వెళ్తాను" అన్నాడు. 'ఇక ఏ యుద్ధం చేయకుండానే, ఈ రాజ్యం నా వశమైపోతుంది" అని లోలోన సంబరపడుతూ.

ఆ బాలలు చిరునవ్వు నవ్వి "మహారాజా మీకు చేపల్ని పట్టడం వచ్చా?" అనడిగారు. ప్రతాపుడు, వారివైపు అయోమయంగా చూస్తు "వచ్చు" అన్నాడు.

"అయితే, మాతో రండి" అంటూ అతడ్ని తమ వెంట తీసుకెళ్ళారు. ప్రతాపుడు అయోమయంగానే వారి వెంట నడిచాడు.

ఆ బాలలు, అతడ్ని పొలం వద్దకి తీసుకెళ్ళి, అతని చేతికి ఒక వలను ఇచ్చి, "రాజా మీరడిగినట్లు మేమే చేపల్ని తెచ్చి మీకివ్వొచ్చు. కానీ, అవి మీకు నచ్చుతాయో లేదో. అందుకే మిమ్మల్నే ఇక్కడికి తీసుకొచ్చాం. అదుగో, ఆ వరి పొలాలలో చేపలుంటాయి. మీకు నచ్చినన్ని చేపల్ని పట్టుకోండి. అప్పుడు మీ కోరిక తీర్చామన్న సంతృప్తి మాకుంటుంది" అన్నారు.

ప్రతాపుడు అయోమయంగానే ఆ పొలంలోకి చూశాడు. అంతే ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. ఆ వరి పొలంలో నిజంగానే చేపల్ని సాగు చేస్తున్నారు. పొలాన్ని రెండు భాగాలుగా చేసి పెద్ద భాగంలో వరిని, చిన్న భాగంలో చేపల్ని సాగు చేస్తున్నారు. ఆ పొలంలో చేపలు చాలా ఆరోగ్యంగా కనిపిస్తున్నాయి. వరిపైరు మరింత ఆరోగ్యంగా కనిపిస్తోంది 'వరి పొలంలో చేపల పంట' అనుకున్నాడు ప్రతాపుడు ఆశ్చర్యపోతూ. అంతే కాదు, ఆ పొలం గట్ల వెంబడి, రకరకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలు, కూరగాయలు సాగు



అభివృద్ధి చెందగలదో నాకర్థమైంది. ఇక నేను యుద్ధాన్ని విరమించుకుంటున్నానని మీ రాజుగారితో చెప్పండి. అలాగే, దయచేసి, నన్ను తన విద్యార్థిగా స్వీకరించమని కోరానని, కరువు నుండి నా రాజ్యాన్ని రక్షించుకునే మార్గాన్ని చూపించమని వేడుకున్నానని చెప్పండి. ఆ గురువుగారి దర్శనం కోసం ఈ నూతన విద్యార్థి వేడుకున్నాడని చెప్పండి" అన్నాడు.

ఆ బాలలు ఆనందంగా వెళ్ళి, ఈ విషయాన్ని వీరభద్రుడితో చెప్పారు. వీరభద్రుడు సంతోషించి, ప్రతాపుడ్ని తన శిష్యుడిగా స్వీకరించి, తనకు తెలిసిన అన్ని విద్యలు నేర్పాడు. అంతేకాదు, కరువుతో అలమటిస్తున్న మహంతి రాజ్యాన్ని

చేస్తున్నారు. అలా ఆ పొలమంతా రకరకాల పంటలతో నిండిపోయింది. అక్కడ, ఒక్క అడుగు నేల కూడా నిరుపయోగంగా ఉంచబడలేదు.

అదంతా చూసిన ప్రతాపుడికి, అంత చిన్న రాజ్యం అత్యంత సుసంపన్న రాజ్యం ఎలా అయ్యిందో అర్థమైంది. అతను వెంటనే, ఆ బాలలతో "విద్య, వివేకం వల్ల ఒక రాజ్యం ఎంత

ఆదుకున్నాడు.

ప్రతాపుడు, తాను నేర్చిన విద్యల్ని తన రాజ్య ప్రజలకు నేర్పించాడు. అనతి కాలంలోనే ఆ రాజ్యం కూడా సస్యశ్యామలంగా మారింది. మహంతి రాజ్య ప్రజలంతా వరి పొలంలో సాగు చేసిన చేపల్ని తింటూ ఆనందంగా బ్రతికారు.

**–డా॥ సిరి,** మిర్యాలగూడ

# Oxford
Grammar High School

KNOWLEDGE IS POWER

ogs JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



# We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - February 2024

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com